


# విజయభాను




విశాఖపట్నం, గురువారం 20-06-2019 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 244 పేజీలు : 8 వెల : 1 రూపాయి

# ఒకే దేశం.. ఒకే ఎన్నిక



**దిల్లీలో అఖిలపక్ష భేటీ ప్రారంభించిన ప్రధాని మోదీ**

**ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధిపై సమీక్ష**

**మహాత్మా గాంధీ జయంత్యుత్సవాల నిర్వహణపై చర్చ**

**హాజరైన తెలుగు రాష్ట్రాల సీఎంలు కేసీఆర్, జగన్**

దిల్లీ: దిల్లీలో అఖిలపక్ష భేటీ ప్రారంభమైంది. ఉభయ సభల్లో ప్రాతినిధ్యం ఉన్న రాజకీయ పార్టీల అధ్యక్షులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంట్ భవనంలోని లైబ్రరీ హాలుకు చేరుకుని సమావేశాన్ని ప్రారంభించారు. జమిలి ఎన్నికలు, ఈ ఏడాది జరిగే మహాత్మాగాంధీ 150వ జయంత్యుత్సవాలు, తదితర అంశాలపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించారు. పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి నేతృత్వంలో జరిగే ఈ భేటీకి కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్‌షాతో పాటు వివిధ రాజకీయ పార్టీలకు తరువాయి 2లో..

తెలంగాణ వరప్రదాయిని..

# కాళేశ్వరం ప్రారంభోత్సవానికి రండి

**గవర్నర్‌తో సీఎం కేసీఆర్ భేటీ**



హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్‌తో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సమావేశమయ్యారు.

ఈ నెల 21న జరిగే తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని తాజా పరిస్థితులపైనా గవర్నర్‌తో చర్చించినట్లు తెలుస్తోంది. తెలంగాణ భవన్‌లో పార్టీ కార్యవర్గ సమావేశం తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌తో భేటీ అయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు.

# సభను నిష్పక్షపాతంగా నడుపుతా

- ప్రతి ఒక్కరూ ఇందుకు సహకరించాలి
- సభా సమయం వృథా చేయరాదు
- 17వ లోక్‌సభకు స్పీకర్‌గా ఎన్నికైన ఓంబిర్లా



దిల్లీ: సభను నిష్పక్షపాతంగా నడుపుతానని.. అందుకు తనకు ప్రతిఒక్కరూ సహకరించాలని నూతనంగా ఎన్నికయిన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కోరారు. లోక్‌సభ సభ్యుల ప్రమాణ స్వీకారం పూర్తయిన వేళ బుధవారం ఓం బిర్లాను స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సభనుద్దేశించి తొలి ప్రసంగం చేశారు. సభను నియమ నిబంధనలకు అనుగుణంగా నడుపుతానని హామీ ఇచ్చారు. పార్టీల బలాబలాల కతీతంగా సభ్యుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సభను నడుపుతానని వ్యాఖ్యానించారు.

ప్రజలకు పారదర్శక పాలన అందించడంతో ప్రధాని మోదీ కృతకృత్యులు తరువాయి 2లో..

శాఖాపరమైన నిర్ణయంతో

# ప్రభుత్వమే చర్యలు తీసుకోవాలి

- ఇంటర్ పరీక్షా ఫలితాలపై ముగిసిన విచారణ
- హైకోర్టు స్పష్టీకరణ



హైదరాబాద్: తెలంగాణ ఇంటర్ ఫలితాల వివాదంపై దాఖలైన వ్యాజ్యాలపై హైకోర్టులో విచారణ ముగించింది.

ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థులకు పరిహారం చెల్లించాలని ఆదేశించలేమని ఉన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. తప్పులకు బాధ్యులపై చర్యలు తీసుకొనే విషయంలోనూ జోక్యం చేసుకోలేమని పేర్కొంది. శాఖాపరమైన నిర్ణయం తీసుకొని ప్రభుత్వమే చర్యలు తీసుకోవాలని హైకోర్టు స్పష్టంచేసింది.

# త్వరలో తితిదే నూతన పాలకమండలి



- ఆర్డినెన్స్ ద్వారా ప్రస్తుత పాలకమండలి రద్దు చేస్తాం
- శ్రీవారి ఆభరణాల భద్రతపై అపోహ నివృత్తిచేయాలి
- దేవాదాయశాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్

తిరుమల: తిరుమల శ్రీవారిని ఏపీ దేవాదాయశాఖమంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ దర్శించుకున్నారు. బుధవారం ఉదయం వీఐపీ ప్రారంభ దర్శన సమయంలో ఆలయం వద్దకు చేరుకున్న మంత్రికి.ం. తితిదే అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు తరువాయి 2లో..

విశాఖను అభివృద్ధి పథంలో

# నెంబర్ వన్‌గా నిలపాలి

**టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుదాం**

**రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు**



విశాఖపట్నం : విశాఖను పర్యాటకంగా అభివృద్ధి చేసి టూరిజం హబ్ గా తీర్చి దిద్దుతామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక యువజన సర్వీసుల శాఖా మంత్రి శ్రీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో పర్యటక, రెవెన్యూ, యువజన సర్వీసుల శాఖ అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్బంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయిన తరువాత భూముల రేట్లు పెరగడంతో కొంతమంది ప్రజా ప్రతినిదులు, స్థానికులు కుమ్మక్కై ప్రభుత్వ భూములను ఆక్రమించడం జరిగిందని, దానికి సంబందించి విచారణ నిమిత్తం సిట్ వేసి దానిలో సంబంధం ఉన్న రెవెన్యూ అధికారులను సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. మరల సిట్ రిపోర్టును పూర్తిగా చదివి అవసరమైతే తిరిగి రీ ఓపెన్ చేసి ప్రభుత్వ భూములను పరిరక్షించడం జరుగుతుందన్నారు. రాబోయే రోజులలో ఇటువంటి తప్పిదాలు ఉత్పన్నం కాకుండా చూడాలని నిజాయితీ, నిస్వార్థంగా పనిచే సే అధికారులకు రాష్ట్ర తరువాయి 2లో..

ఏపీ భవనాల అప్పగింత

# పక్రియ ముమ్మరం

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి గవర్నర్ నరసింహన్ ఇటీవల జారీచేసిన ఆదేశాల నేపథ్యంలో ఏపీ భవనాలను తెలంగాణ ప్రభుత్వానికి అప్పగించే ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఏపీకి కేటాయించిన సచివాలయ భవనాలను అధికారులు తెలంగాణకు అప్పగిస్తున్నారు. ఈ నెల 19వ తేదీ లోపు భవనాలను పూర్తిస్థాయిలో తెలంగాణకు అప్పగిస్తామంటూ ఏపీ సీఎస్ ఎల్వీ సుబ్రమణ్యం.. తెలంగాణ సీఎస్ ఎస్కే జోషికి లేఖ రాసిన విషయం తెలిసిందే. అందుకనుగుణంగా భవనాల అప్పగింత ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ మేరకు ఏపీకి చెందిన భవనాల్లోని సామగ్రిని అధికారులు అమరావతికి తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే కొన్ని భవనాల అప్పగింత ప్రక్రియ పూర్తయింది. సచివాలయంలో మరికొన్ని బ్లాక్‌లను అప్పగించే ప్రక్రియ పూర్తవగా.. మిగిలిన మరికొన్ని బ్లాక్‌ల అప్పగింత ప్రక్రియ కొనసాగుతోంది. అనంతరం భవనాల అప్పగింతపై అధికారిక ఉత్తర్వులు జారీ చేయనున్నారు.









# మాసాంతానికల్లా గరిష్ఠ స్థాయి పనులు నిర్వహించాలి

**ఎంపీడీఓ., ఏపీడీఓలతో ముఖ్య సమావేశం**

**వర్షాల రాకతో కూలీలకు మట్టిపనులకు సులువౌతుంది**

**సైనేజీ బోర్డులుతప్పని సరిగా పెట్టాలి**

**కాకినాడ జిల్లా కలెక్టర్ డి.మురళీధరరెడ్డి**



కాకినాడ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద జిల్లాలో ఈ మాసాంతానికి గరిష్ట స్థాయిలో వేతన పనులు, చెల్లింపులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డి.మురళీధరరెడ్డి యంపిడిఓలు, ఏపిడిలను కోరారు.

బుధవారం ఉదయం కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాలులో జిల్లా కలెక్టర్ మురళీధరరెడ్డి యంపిడిఓలు, ఎపిడిలు, టెక్నికల్ కన్సల్టెంట్లతో సమావేశం నిర్వహించి జిల్లాలో ఉపాధి హామీ పనుల ప్రగతిని సమీక్షించారు. సమావేశంలో డ్వామా పిడి వెంకట రమణ ఈ యేడు ఏప్రియల్ నుండి జూన్ వరకూ నిర్వహించిన పనులు, మండలాల వారీగా వివిధ అంశాల క్రింది లక్ష్య సాధన వివరాలను ఆయనకు తెలియజేశారు. జిల్లాలో ఏప్రియల్ నుండి జూన్ వరకూ సుమారు 260 కోట్ల వ్యయంతో ఉపాధి హామీ పనులు నిర్వహించడం జరిగిందని, ఇందులో 192 కోట్లు కూలీలకు వేతనాలుగా చెల్లించామని పిడి తెలిపారు. జూన్-13 వరకూ చెల్లింపులు పూర్తి చేశామని, తద్వారా 62 కోట్ల మేరకు మెటీరియల్ కాంపోనెంట్ సమకూరిందన్నారు. జిల్లాలో మరో 65 కోట్ల మెటీరియల్ కాంపోనెంట్ సాధించేందుకు ఉపాధి పనుల పొటెన్సియల్ ఉందని తెలియజేశారు. ఉపాధి పనుల పొటెన్సియల్ ఉందని తెలిపారు. జిల్లాలో 8.30 లక్షల జాబ్ కార్డులు జారీ చేయగా, 4.76 లక్షల మంది ఉపాది కోరుతన్నారని, సుమారు 2.9 లక్షల మంది పనులకు హాజరౌతున్నారని తెలిపారు. జిల్లాలో కూలీలకు 211 రూపాయల సగటు వేతనం చెల్లింపు లక్ష్యానికి గాను ప్రస్తుతం 207.60 రూపాయలు చొప్పున కూలీలు పొందుతున్నారని తెలిపారు. అలాగే ఈ యేడు జిల్లాలో కనీసం 70 శాతం జాబ్ కార్డుదారులకు 100 రోజుల ఉపాధి కల్పనకు లక్ష్యం నిర్దేశించడం జరిగిందన్నారు.

అనంతరం జిల్లా కలెక్టర్ మురళీధరరెడ్డి సమీక్షిస్తూ, ఉపాధి హామీ పనుల నిర్వహణకు నెలాఖరు వరకూ అనువైన కాలాన్ని సద్వినియోగం చేసుకుని, గరిష్ట స్థాయిలో పనులు, కూలీల హాజరుతో ఎక్కవ మొత్తం వేతన కాంపోనెంట్ సాధించాలని యుండిఓలు, ఎపిడిలను ఆదేశించారు. తద్వారా అధిక మెటీరియల్ కాంపోనెంట్ నిధులు జిల్లాలో వివిధ అభివృద్ధి పనుల నిర్వహణకు సమకూరగలవన్నారు. వర్షాల రాకతో కూలీలకు మట్టి పనులు సులభమౌతాయని, అటువంటి పనులను పెద్ద సంఖ్యలో చేపట్టాలని సూచించారు. దాదాపు మూడు నెలల పాటు ఎన్నికల నిర్వహణలో నిమగ్నం కావడం వలన, ఎన్నికల అనంతరం తాము బదిలీ కానున్నామనే భావనతో అధికారులు నిర్లిప్త ధోరణి వహించడం వలన జిల్లాలో ఉపాధి హామీ పనుల ప్రగతి కొంత మందగించిందన్నారు. ఉద్యోగాలలో బదిలీలు సాధారణ అంశమేనని, ఈ కారణంగా నిర్వహించాల్సిన విధుల పట్ల నిరాశక్తత చూపడం సరికాదన్నారు. ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్ కొరకు ప్రజావాణి గ్రీవెన్స్ సెల్ కు అర్జీలు అందుతన్నాయని, పనులు నిర్వహించిన ప్రదేశాలలో వాటికి సంబందించిన సమగ్ర సమాచారంతో పారదర్శకంగా సైనేజి బోర్డులు తప్పని సరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. అలాగే నిర్వహించిన పనులను జియో టాగింగ్ చేయడంతో బాటు, అభివృద్ధి చేసిన ఆస్తుల ఇన్ ఎంటరీ ఏర్పాటు చేయాలని సూచించారు. కేవలం టెక్నాలజీ పైనే ఆధారడ కుండా, యండిఓలు, ఎపిడిలు, జిల్లా అధికారులు విస్తృత క్షేత్ర పర్యటనలు నిర్వహించాలని, అపుడే నిర్వహించిన పనుల పర్యవేక్షణ ఖచ్చితంగా ఉండి, అపోహలకు, అనుమానాలకు ఆస్కారం తగ్గుతుందన్నారు. ప్రతి సోమవారం పూర్తి రోజు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, వారి సమస్యలను సావధానంగా తెలుసుకుని పరిష్కరించాలని ఆదేశించారు. లక్ష్య సాధనలో వెనుకబడిన అధికారులు, సిబ్బందికి అయా అంశాలలో మరోమారు అవగాహన, శిక్షణ కల్పించాలని, ఇందుకు సామర్లకోట ట్రైనింగ్ సెంటర్లో ఉన్న వసతులను వినియోగించుకోవాలని డ్వామా పిడికి సూచించారు. ప్రతి సోమవారం ఆయా అంశాల లక్ష్య సాధనలో అట్టడుగు ఆరు స్థానాల్లో నిలిచిన అధికారులతో మాత్రమే సమీక్షిస్తామన్నారు. ఈ అధికారులు తమతమ ప్రధాన కార్యస్థానం నుండి మాత్రమే వీడియో కాన్ఫరెన్స్ లో హాజరు కావాలని, సహాయకుల నేపద్య సహకారం లేకుండా తామే స్వయంగా వైఫల్యాలకు కారణాలను వివరించాల్సి ఉంటుందని ఆదేశించారు.

అంశాల వారీ సమీక్షలో కూలీల హాజరు అంశంలోను, వేతన సాధనలోను రంపచోడవరం, కె.గంగవరం, సీతానగరం మండలాలు మంచి ప్రగతి సాధించగా, మామిడికుదురు, తొండంగి, రామచంద్రపురం మండలాలు బాగా వెనుకంజలో ఉన్నాయన్నారు. అలాగే నిర్వహించిన పనులకు 3 రోజుల్లోపు వేతన ఎఫ్ టి ఓలు జనరేట్ చేయడంలో సఖినేటిపల్లి, సీతానగరం, మండపేట మండలాలు ప్రగతిలో ఉండగా, చింతూరు, గొల్లప్రోలు, అమలాపురం మండలాలు వెనుకబడి ఉన్నాయన్నారు. కన్వర్జెన్సీ పనులకు చెల్లింపుల అంశంలో హౌసింగ్, పాఠశాల విద్య శాఖలు ముందు నిలువగా, పశుసంవర్ధన, పంచాయితీరాజ్, అటవీ శాఖల చెల్లింపులు జాప్యం అవుతున్నాయన్నారు. సమీక్షలో వెనుకజ స్థానాల్లో ఉన్న మండలాలు, శాఖలు వచ్చే సోమవారానికి లక్ష్య సాధనను మెరుగు పరచుకోవాలని ఆదేశించారు.

గరిష్ట స్థాయిలో సగటు వేతనం సాధించేదుకు పని సమయాలను మరో గంట పొడించి పనులు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్-2 సిహెచ్.సత్తిబాబు, జడ్పి సిఈఓ బి.విద్యాసాగర్, యండిఓలు, ఉపాధి హామీ పథకం ఎపిడిలరు.

## జమిలితో ధన ప్రవాహానికి అడ్డుకట్ట : కేటీఆర్

దిల్లీ: జమిలి ఎన్నికల ప్రతిపాదనను ఆహ్వానించామని.. అఖిలపక్షం సమావేశంలో దీనిపై తమ అభిప్రాయం చెప్పామని తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. రాష్ట్రాలు బలోపేతం అయితేనే దేశం బలపడుతుందనే విషయాన్ని ప్రధాని మోదీ, కేబినెట్ మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. దిల్లీలోని పార్లమెంట్ లైబ్రరీ హాలులో జరిగిన అఖిలపక్ష భేటీ ముగిసిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. సుమారు 4 గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో ముఖ్యంగా ఐదు అంశాలపై చర్చించామన్నారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తి కావొస్తుండటం.. మహాత్మాగాంధీ 150వ జయంత్యుత్సవాల నిర్వహణ, జమిలి ఎన్నికలు తదితర అంశాలపై ఎలాంటి కార్యక్రమాలు చేపడితే బాగుంటుందనే దానిపై చర్చ జరిగిందని కేటీఆర్ వివరించారు. జమిలి ఎన్నికల నిర్వహణలో సాధక బాధకాలు ఏమున్నా.. తెరాస తరఫున దాన్ని ఆహ్వానిస్తున్నట్లు అభిప్రాయం చెప్పామన్నారు. పరిమిత కాల వ్యవధిలో దీన్ని పూర్తి చేయాలని సూచించామని.. ఒకేసారి ఎన్నికలతో ప్రజలు కూడా ప్రభుత్వ ఫలాలను అనుభవించే వీలుంటుందని కేటీఆర్ చెప్పారు. ఎన్నికల్లో ధన ప్రవాహాన్ని అడ్డుకునేందుకు, నిర్వహణ ఖర్చు తగ్గించుకునేందుకు జమిలి దోహదం చేస్తుందని అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా దఫాలుగా ఎన్నికల నిర్వహణతో కోడ్ అమల్లో ఉండి పాలన కుంటుపడుతోందని చెప్పారు.

జమిలి ఎన్నికల విషయంలో అవసరమైతే రాజ్యాంగ సవరణ చేయాలని.. దీనికి తెరాస పూర్తిగా సహకరిస్తుందని చెప్పినట్లు కేటీఆర్ వెల్లడించారు. అధికార వికేంద్రీకరణ జరగాలని.. ముఖ్యంగా వ్యవసాయం, విద్య, వైద్యం అంశాలను రాష్ట్రాలకు బదలాయించాలని కోరామన్నారు. గాంధీ 150వ జయంత్యుత్సవాల్లో భాగంగా కేంద్రం సహకారంతో రాష్ట్రంలో 150 పాఠశాలలు, 150 ఆస్పత్రులు, 150 గ్రామాలను లక్ష్యంగా పెట్టుకుని ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తే బాగుంటుందని సూచించామని.. ఈ అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారని కేటీఆర్ తెలిపారు.

## హరిత వాణిజ్యంపై గీతం వర్క్‌షాప్




సాగర్‌నగర్: పర్యావరణ హితంగా ఉండే సాంకేతిక పరిజ్ఞానాన్ని సూచించడం, హరిత ఆధారిత వాణిజ్యం పై నూతన ఆలోచనలను యువతలో ప్రోత్సాహించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం పర్యావరణ శాస్త్ర విభాగం, క్లైమేట్ లాంచ్‌పాడ్ ఇండియా సంస్థలు సంయుక్తంగా గీతంలో ఒకరోజు వర్క్‌షాప్‌ను బుధవారం నిర్వహించాయి. ముఖ్యఅతిధిగా హజరైన గీతం ఇన్ ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎన్.శివప్రసాద్ మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్ కారణంగా ఉష్ణోగ్రతలు పెరిగి వివిధ రూపాలలో ఆహర కొరత ఏర్పడుతోందన్నారు. నీటి వనరులు అడుగంటుతున్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి భాద్యత అన్నారు. నూతన ఆలోచనలతో పర్యావరణ నష్టాలను తగ్గించాలని సూచించారు.

గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎమ్.శరత్‌చంద్రబాబు మాట్లాడుతూ నూతన పదార్ధ విజ్ఞానం పై జరుగుతున్న పరిశోధనలు కొంత వరకు పర్యావరణాన్ని రక్షిస్తాయన్నారు. పర్యావరణ శాస్త్ర విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాస్ ,క్లైమేట్ లాంచ్‌పాడ్ ఇండియా వ్యవస్థాపకుడు ప్రతాప్ రాజు, ఎస్.ఎమ్.ఆర్.ఎనర్జీ సంస్థ డైరక్టర్ ఎస్.మంగళగిరి తదితరు పాల్గొని పార్యవరణ హితాన్ని కోరే వ్యాపార వేత్తలు, నూతన ఆలోచనలు గల యువతరం దేశానికి అవసరం అన్నారు. కార్యక్రమంలో సీనియర్ ప్రొఫెసర్‌లు, వివిధ కళాశాల విద్యార్ధులు తరితరులు పాల్గోన్నారు.

## వన్యప్రాణుల దాడుల మృతులకు రూ. 5 లక్షల పరిహారం

**మంత్రి బాలినేని శ్రీనివాస్‌రెడ్డి**



అమరావతి : అటవీశాఖ ఉన్నతాధికారులతో మంత్రి బాలినేని శ్రీనివాస్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది 25 కోట్ల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. అటవీ విస్తీర్ణంలో దేశంలోనే మొదటిస్థానంలో ఉన్నామని పేర్కొన్నారు. ఎర్రచందనం అమ్మకాల ద్వారా ఇప్పటివరకూ రూ. 1688 కోట్ల ఆదాయం వచ్చిందని వెల్లడించారు. ఎర్రచందనం పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని..5 వేల మెట్రిక్ టన్నుల ఎర్రచందనం అమ్మకానికి కేంద్రం అనుమతి కోరామని తెలిపారు. అదే విధంగా రాష్ట్రంలో పెరిగిపోతున్న కాలుష్య నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామన్నారు. ఇక వన్యప్రాణుల దాడుల్లో మృతి చెందిన వారికి రూ. ఐదు లక్షల పరిహారం అందిస్తామని పేర్కొన్నారు. పావురాల గుట్టలో ఉన్న వైఎస్సార్ స్మృతి వనాన్ని రూ. 25 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు.

## తితిదే ఛైర్మన్ పదవికి పుట్టా రాజీనామా!

**సుమారుగా పాలకమండలి రద్దయినట్లే**

తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ఛైర్మన్ పదవికి పుట్టా సుధాకర్ యాదవ్ రాజీనామా చేశారు. పుట్టా తన రాజీనామా లేఖను తితిదే ఈవో అనిల్ సింఘాల్‌కు అందజేశారు. మరోవైపు తితిదే కొత్త ఛైర్మన్‌గా వైకాపా సీనియర్ నేత, మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డిని ప్రభుత్వం నియమించినట్లు తెలుస్తోంది. సుబ్బారెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం. అయితే దీనికి సంబంధించి ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు వెలువడలేదు. మరోవైపు పుట్టా రాజీనామాపై సుబ్బారెడ్డి స్పందించారు. ఆయన రాజీనామా చేసినట్లు సీఎం కార్యాలయానికి సమాచారం వచ్చిందన్నారు. తితిదే ఛైర్మన్‌గా బాధ్యతల చేపట్టే విషయంలో సీఎం జగన్ ఎప్పుడు తీసుకోమంటే అప్పుడే తీసుకుంటానని చెప్పారు. శనివారం మంచి రోజు అని సలహాలు, సూచనలు వచ్చాయని.. సీఎం ఆదేశాల ప్రకారం బాధ్యతలు చేపడతానని సుబ్బారెడ్డి తెలిపారు. తితిదే ధర్మకర్తల మండలిలో ఛైర్మన్ సహా 16 మంది సభ్యులుండగా.. వారిలో 10 మంది ఇప్పటికే రాజీనామా చేశారు. తాజాగా పుట్టా రాజీనామాతో పాలకమండలి రద్దయినట్లైంది. మరోవైపు తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రిలో సిబ్బంది నియామకాల విషయంలో తితిదే ఛైర్మన్ పుట్టా సుధాకర్ యాదవ్‌పై ఆరోపణలు వచ్చాయి. నిబంధనలకు విరుద్ధంగా తితిదే ఛైర్మన్ తనపై ఒత్తిడి తెస్తున్నారంటూ స్విమ్స్ డైరెక్టర్.. ఈవో అనిల్ సింఘాల్‌కు ఫిర్యాదు చేశారు.

మొదటి పేజీ తరువాయి

## ఒకే దేశం.. ఒకే ఎన్నిక..

చెందిన నేతలంతా హాజరయ్యారు. ఏపీ సీఎం జగన్ హాజరయ్యారు. ఒకే దేశం ఒకే ఎన్నికలు నినాదాన్ని దేశవ్యాప్తంగా చర్చలోకి కేంద్రం తీసుకొస్తోంది. వచ్చే మూడేళ్ల కాలంలో మూడు నుంచి ఎనిమిది రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగే ఆస్కారం ఉన్నందున జమిలి ఎన్నికలపై ఒక్కోపార్టీ విధానం ఎలా ఉంది? ఒకేసారి ఎన్నికల నిర్వహణకు చర్యలు ఎలా తీసుకోవాలి? న్యాయపరమైన చిక్కులు ఎలా ఉన్నాయి? తదితర అంశాలపై చర్చించారు. దేశంలో ఇప్పటివరకు జరిగిన అభివృద్ధిని సమీక్షిస్తూనే కొత్త కార్యక్రమాలతో ఎలా ముందుకెళ్లాలనే అంశంపైనా చర్చించారు. ఈ ఏడాది మహాత్మా గాంధీ 150వ జయంత్యుత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై కీలకంగా చర్చించనున్నారు. జాతిపిత మహాత్ముడికి ఒక్కో రాష్ట్రంతో ఒక్కోవిధమైన అనుబంధం ఉన్న నేపథ్యంలో ఆయన సందర్శించిన ప్రదేశాల్లో ఎలాంటి ఏర్పాట్లు చేయాలనే అంశంపైనా చర్చించారు.

ఈ భేటీలో ఎన్సీపీ అధినేత శరద్ పవార్, జేయూడీయూ అధ్యక్షుడు నితీష్‌కుమార్, బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్, శిరోమణి అకాళీదల్ అధినేత ప్రకాశ్‌సింగ్ బాదల్, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి, వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి, తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, లోక్‌జనశక్తి అధినేత రాంవిలాస్ పాసవాన్, పీడీపీ అధినేత్రి మహబూబా ముఫ్తీ తదితరులు పాల్గొన్నారు.

## సభను నిష్పక్షపాతంగా నడుపుతా

అయ్యారని బిర్లా ప్రశంసించారు. అలాగే 17వ లోక్‌సభలోనూ ప్రభుత్వం మరింత బాధ్యతాయుతంగా, జవాబుదారీగా వ్యవహరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సభలో ప్రతిఒక్కరి సమస్యలను విని వారికి సావధానంగా జవాబు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తుచేశారు. సభను సజావుగా నడిపేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. సమయం వృథా చేయకుండా కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వచ్చే అంశాలను మాత్రమే సభలో ప్రస్తావించాలన్నారు.

స్పీకర్ పదవికి ఓం బిర్లా పేరును బుధవారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సభలో ప్రతిపాదించగా కేంద్ర మంత్రులు, వివిధ పార్టీల ఎంపీలు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ప్రొటెం స్పీకర్ వీరేంద్ర కుమార్ మూజువాణి ఓటు ద్వారా ఎన్నిక ప్రక్రియ చేపట్టి బిర్లా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు.

## విశాఖను అభివృద్ధి పథంలో నెంబర్ వన్‌గా నిలపాలి

ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో కూడా కొంతమంది ఆక్రమణ దారులు ప్రభుత్వ భూములు, స్థలాలు, ఇళ్లను ఆక్రమించుకున్నట్లు ఫిర్యాదులొచ్చాయని సంబందితులందరిపై తగుచర్యలు చేపట్టాల్సిందిగా ఆదేశించారు. ఇకముందు జిల్లాలో ఎక్కడా అవినీతి జరగకుండా భూముల పరిరక్షణ చేపట్టాలన్నారు.

ఆర్థిక రాజధానిగా ఎదుగుతున్న విశాఖను అన్ని రంగాలలోను అభివృద్ధి చేసి దేశంలో నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టనున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదు సంవత్సరాల కాలంలో ఇళ్లు లేని ప్రతి నిరు పేదకు రాజకీయాలకతీతంగా ఐదులక్షల ఇళ్ల స్థలాలను , ఐదు లక్షల ఇంటి పట్టాలను పంపిణీ చేయనున్నామన్నారు. రేషన్ డిపోలలో డీలర్ల అక్రమాలు ఎక్కువగా జరిగాయని వాటికి సంబందించి డివిజన్లలలో సమీక్షలు చేపట్టాలన్నారు. అక్టోబర్ నెలలో గ్రామ వాలంటీర్లను నియమించి ప్రభుత్వ పథకాలన్ని పారదర్శకంగా అందించేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్క అధికారి జవాబుదారీ తనంతో పనిచేసి అవినీతి రహిత జిల్లాగా విశాఖను తీర్చి దిద్దాలన్నారు.

పర్యాటక రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నదని, రాబోయే రోజులలో నూతన టూరిజం ప్రాజెక్టులను చేపట్టనున్నామన్నారు. జిల్లాలో టూరిజంకు సంబందించి 355 ఎకరాల స్థలం ఉన్నదని, సుమారు 60 ఎకరాలలో పది టూరిజం ప్రాజెక్టులను చేపట్టడం జరుగుతున్నదని, పిపిపి తరహాలో కొత్త టూరిజం ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టనున్నామన్నారు. రేవుపోలవరం, పరవాడ, యారాడ, ముత్యాలమ్మ పాలెం , పూడిమడక, దబ్బందలతో పాటు ఏజెన్సీ ప్రాంత మండలాలలో టూరిజం ప్రాజెక్టులను అభివృద్ధి చేయనున్నామన్నారు. రూ 280కోట్లతో కేంద్రప్రభుత్వం చేపట్టనున్న ప్రాజెక్టులు పెండింగ్ లో ఉన్నాయని వాటిని కూడా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. బౌద్ధారామాలు, తొట్లకొండ, బావికొండ, బొజ్జన్న కొండలను అభివృద్ధి చేయనున్నామన్నారు.

## త్వరలో తితిదే నూతన పాలకమండలి

చేశారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు.

ఈ సందర్భంగా ఆలయం వెలుపల మంత్రి మీడియాతో మాట్లాడుతూ... ఆర్డినెన్స్ ద్వారా తితిదే ప్రస్తుత పాలకమండలిని రద్దు చేసి త్వరలో నూతన బోర్డును నియమిస్తామన్నారు. శ్రీవారి ఆభరణాల భద్రతపై ఉన్న అపోహలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉందని, త్వరలోనే తితిదే అధికారులతో సమీక్షిస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దేవాలయాల్లో వంశ పారపర్యంగా వస్తున్న అర్చకత్వానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి ప్రకటించారు.

# మత్స్యకారులను ఆదుకుంటాం

- హుదూద్ నిర్వాసితులకు సౌకర్యాలు కల్పిస్తాం
- సీఎం జగన్మోహన్ నాయకత్వంలో అందరికీ న్యాయం చేస్తాం
- తీరప్రాంతంలో రక్షణగోడ నిర్మిస్తాం
- మంత్రి అవంతిని కలిసి విన్నవించిన మత్స్యకారులు



భీమునిపట్నం : బుధవారం ఉదయం విశాఖ జిల్లాకు చెందిన మత్స్యకార నాయకులు మాజీ కార్పొరేటర్ బుడ్డా నీలకంఠం ఆధ్వర్యంలో పర్యాటక శాఖమంత్రి అవంతి శ్రీనివాసరావు స్వగృహంలో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

భీమునిపట్నం నియోజకవర్గంలో హుదూద్ తుఫాన్ వలన సముద్ర తీర్రపాంతం మత్స్యకార గృహాల వరకు కోతకు గురైన విషయం విదితమే. కోతకు గురైన ప్రాంతంలో రక్షణ గోడలు నిర్మించాలని, హుదూద్ తుఫాన్ వల్ల నిర్వాసితులు అయినటువంటి మత్స్యకారులకు చిన్న మంగమారిపేట ప్రాంతంలో సుమారు మూడు వందల పక్కా గృహాలు నిర్మించి పట్టాలు ఇప్పించాలని మత్స్యకార నాయకులు మంత్రిని కోరారు.

అదేవిధంగా మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలని, అందుకోసం ముఖ్యమంత్రితో మాట్లాడాలని, ఎస్టీ రిజర్వేషన్ అంశం కేంద్రం పరిధిలో ఉంటుంది కాబట్టి ముందుగా మత్స్యకారులను ఎం.బీ.సీ.ల్లో చేర్చాలని మంత్రిని కోరడం జరిగింది. అవంతి శ్రీనివాసరావు మత్స్యకార నాయకులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజలను నిర్లక్ష్యం చేయడం వలన అనేక రకాల అభివృద్ధి కార్యక్రమాలు ఆగిపోయాయని. సీఎం జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో అందరికీ న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని విశాఖ జిల్లాకు చెందిన తీర ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని దీనివలన మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని, రక్షణ గోడ నిర్మాణం, మత్స్యకారులకు పక్కా గృహాలు త్వరలోనే నిర్మించి ఇస్తామని మంత్రి నాయకులకు హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు చెన్నా దాస్, చొక్కా పెంటారావు, దౌలపల్లి కొండ బాబు, వాసుపల్లి నల్ల బాబు, బుడ్డా శ్రీనివాస్, వాసు పల్లి రంగారావు, దూడ ధనంకొండ, గంటా దాస్, తదితర నాయకులు పాల్గొన్నారు.

## యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం.. 8మంది మృతి

సంభల్: ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మోరదాబాద్-ఆగ్రా జాతీయ రహదారిపై మినీ వ్యాన్.. గూడ్స్ ట్రక్కు ఢీకొని 8 మంది దుర్మరణం చెందారు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

లెహ్రావాన్ గ్రామ సమీపంలో సరుకులు మోసుకెళ్తున్న వాహనాన్ని మినీ వ్యాన్ ఢీకొట్టింది. ఈ ఘటనలో వ్యాన్‌లో ఉన్న ఎనిమిది మంది అక్కడికక్కడే మృతిచెందగా.. మరో 11 మంది గాయపడ్డారు. బాధితులు వివాహ వేడుకకు హాజరై తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారమందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# నిబంధనలు పాటించని 18 కళాశాలకు నోటీసులు



నర్సీపట్నంః ప్రభుత్వ నిబంధనలు పాటించని 18 ప్రైవేటు జూనియర్ కళాశాలలకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని ఇంటర్ బోర్డు ఏరియా తనిఖీ అధికారి టి.నగేష్‌కుమార్ వెల్లడించారు. ప్రభుత్వం నుంచి అనుమతి పొందేందుకు ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు వారి దరఖాస్తులో పొందుపరిచిన అంశాలు పాటించటంలేదన్నారు.

దరఖాస్తు ల్లో పేర్కొన్న చిరునామాల్లో కాకుండా మరొక చోట తరగతులు నిర్వహించడం, విద్యార్థినులకు అవసరమైన మరుగుదొడ్లు సదుపాయం కల్పించకపోవడం ఫైర్ సేఫ్టీ చర్యలు సక్రమంగా తీసుకోకపోవడం వంటి కారణాలపై షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. అంతేకాకుడా సదరు కళాశాలకు లక్ష నుంచి రూ.5లక్షల వరకూ జరిమానా విధించామని రెండు వారాల్లోగా సదరు మొత్తానికి వీరు చెల్లించని పక్షంలో వారు కళాశాలల గుర్తింపును రద్దు చేస్తామన్నారు.

నర్సీపట్నం ప్రాంతంలోని 11 ప్రైవేటు జూనియర్ కళాశాలలు, పాడేరులో రెండు జూనియర్ కళాశాలలు, దేవరాపల్లిలో ఒక కళాశాల, విశాఖ సిటీ పరిధిలో నాలుగు జూనియర్ కళాశాలలకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు.

సదరు ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు సకాలంలో స్పందించని పక్షంలో ఇంటర్ బోర్డు పరంగా ఆన్‌లైన్‌లో వాటి అడ్మిషన్‌లను నిలిపి వేస్తామని ఆర్ఐవో నగేష్‌కుమార్ తెలిపారు.

# రెవెన్యూ వ్యవస్థలో మార్పు రావాలి

రోలుగుంటః రైతులను తమ చుట్టూ తిప్పుకొని ఇబ్బంది పెట్టే రెవెన్యూ వ్యవస్థలో మార్పు రావాలని వైసిపి నాయకులు పోతల లక్ష్మీ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. లేకుంటే ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోలుగుంటకు చెందిన 216 నెంబరు పట్టాదారు పాసు పుస్తకం కలిగిన తమరాన జోగినాయుడు అనే రైతుకు కొంత భూమి ఉంది. ఇటీవలే తన కుమార్తెకు వివాహం చేసి కొంత భూమిని గిఫ్ట్ డిడ్ రాయాలని తలచి రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి అధికారులను కలిసాడు. అధికారుల చుట్టూ తిరిగినా పని జరగకపోవడంతో మాజీ సర్పంచ్, వైసిపి నాయకులు పోతల లక్ష్మీ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన బాధితునితో కలిసి వెళ్లి అధికారులను నిలదీశారు. అధికారుల నుంచి సరైన స్పందన లేకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. రైతు పాసు పుస్తకం ఆధారంగా ఆన్‌లైన్ వివరాలు చూసి అర్హత మేరకు న్యాయం చేయాలని కోరారు. రైతులకు రెవెన్యూ సేవలు మెరుగ్గా అందించే విధానపరమైన చర్యలు కోసం ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

# పటిష్ట నిఘాతో గంజాయి రవాణా తగ్గుముఖం

రావికమతంః కొత్తకోట సర్కిల్ పరిధిలో గంజాయి అక్రమ రవాణాపై నిఘా పటిష్టం చేయడంతో రవాణా తగ్గుముఖం పట్టిందని నర్సీపట్నం ఏఎస్పీ కె.ఆరీఫ్‌హాఫిజ్ అన్నారు. రావికమతం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. గంజాయి అక్రమ రవాణాపై దృష్టిసారించామన్నారు. నర్సీపట్నంలో ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 2500కిలోల గంజాయి పట్టుకున్నామని చెప్పారు. పంచాయతీ ఎన్నికల దృష్ట్యా తమ సిబ్బంది అన్ని గ్రామాల్లోనూ పర్యటించి, అల్లర్లు సృష్టించే వారిపై ముందుగానే బైండోవర్‌లు చేస్తున్నామన్నారు. రోలుగుంటలోని పెదపాడు గ్రామానికి చెందిన నిందితుడు నాగార్జున ఆరు నెలలుగా తప్పించుకు తిరుగుతుండగా, ఆయన్ను వలపన్ని పట్టుకున్నామని తెలిపారు. రాత్రి వేళ తిరిగే వారి వేలిముద్రలు సేకరించడం ద్వారా పాత, కొత్త నేరస్తులను గుర్తిస్తున్నామని తెలిపారు. రావికమతం, నర్సీపట్నం, పాయకరావుపేట, యలమంచిలి రూరల్, అచ్యుతాపురం, నక్కపల్లి ప్రాంతాల్లో రాత్రి వేళ గస్తీ తిరిగే పోలీసు సిబ్బంది అనుమానంగా తిరుగుతున్న వారి వేలిముద్రలు సేకరించడం ద్వారా పాత నేరస్తులను గుర్తిస్తున్నామన్నారు. ఈ పిన్స్ పరికరంలో పాత నేరస్తుల వేలిముద్రలు నిక్షిప్తమై ఉంటాయని, దీని వల్ల చోరీలకు వస్తున్న వారితో పాటు పాత నేరస్థులు పట్టుబడుతున్నారని తెలిపారు. అలాగే వ్యాపారుల సహకారంతో నర్సీపట్నం డివిజన్‌లోని ముఖ్య కూడళ్లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని ఆయన చెప్పారు. ఆయనతో పాటు కొత్తకోట సిఐ లక్ష్మణమూర్తి, రావికమతం ఎస్సై చంద్రశేఖర్ ఉన్నారు.

# కులాల వారీ ఓటరు జాబితా విడుదల

యలమంచిలి రూరల్ః ఓటరు జాబితాను యలమంచిలి మున్సిపాలిటీ అధికారులు విడుదల చేశారు. ఈ జాబితాలో మొత్తం 35,228 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు కన్నా మహిళలు 1,215 మంది అధికంగా ఉన్నారు. ఓటర్ల కుల గణన కార్యక్రమం పూర్తి చేశామని, వార్డుల వారీ కుల గణన చేపట్టామని వారు పేర్కొన్నారు. వీరిలో 9 మంది ఓటర్లు అభ్యంతరాలు వ్యక్తం చేయగా క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టామని మున్సిపల్ కమిషనర్ పి.సింహాచలం తెలిపారు. సుమారు 200 మందికి రెండు చోట్ల ఓట్లు ఉన్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. జాబితాను మున్సిపాలిటీ కార్యాలయం నోటీసు బోర్డులో ఉంచామన్నారు.

# ఎయిడ్స్ వ్యాధిపై ఆందోళన అవసరం లేదు



నాతవరంః ఎయిడ్స్ వ్యాధి సోకిన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నేచర్ సంస్థ కోఆర్డినేటర్ రామకృష్ణ అన్నారు. మండలంలో తాండవ జంక్షన్‌లోని జీడిపిక్కల పరిశ్రమలో మహిళలకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సూచనల మేరకు ఆ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరికి ఎయిడ్స్‌పై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎయిడ్స్ రాకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుసుకోవాలన్నారు. ఎయిడ్స్‌కు మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. పలువురి సందేహాలను ఆయన నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రాపౌట్లకు సీట్లు కేటాయించాలి

మాకవరపాలెంః కస్తూర్బా పాఠశాలలో డ్రాపౌట్ విద్యార్థులకు సీట్లు మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. మండలంలో ఉన్న కస్తూర్బా పాఠశాలలో ఆరో తరగతిలో చేరేందుకు గాను తూటిపాల పంచాయతీకి చెందిన చిటికెల పాప, శృంగవరం పూజిత ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారు. వీరిద్దరు మధ్యలో బడిమానేసిన వారే. అయితే కస్తూర్బా పాఠశాలలో చేరేందుకు విద్యార్థులకు తల్లిదండ్రులు లేకపోయినా మధ్యలో బడిమానేసిన వారికే అవకాశం ఉంది. కానీ పై ఇద్దరు విద్యార్థులు డ్రాపౌట్స్ అయినప్పటికీ వారికి సీట్లు కేటాయించలేదని వారి తల్లిదండ్రులు చెబుతున్నారు. అర్హత ఉన్న తమ పిల్లలకు సీట్లు మంజూరు చేయాలని అధికారులను వారు కోరుతున్నారు.

## డిగ్రీ కళాశాల అటానమస్‌గా గుర్తింపునకు బృందం రాక

యలమంచిలి రూరల్ః యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి(అటానమస్)గా గుర్తించేందుకు ఈ నెల 24న ఆరుగురు సభ్యులతో కూడిన బృందం రానుందని కళాశాల ప్రిన్సిపాల్ కె.మాలాద్రి తెలిపారు.

రెండు రోజుల పాటు ఈ బృందం కళాశాల స్థితిగతులను పరిశీలిస్తుందన్నారు. బృందం పర్యటన అనంతరం నిబంధనలు ప్రకారం కళాశాలకు అటానమస్ గుర్తింపు వచ్చే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. యలమంచిలి కళాశాల రెండు సార్లు నేక్ ఏ గ్రేడ్ సాధించడమే కాకుండా గ్రామీణ జిల్లాలోనే పిజి కోర్సులు కలిగిన ఏకైక కళాశాలగా మంచి గుర్తింపు ఉందన్నారు. 1987 సంవత్సరంలో ఏర్పాటు చేసిన ఈ కళాశాలకు అటానమస్‌గా గుర్తింపు వస్తే మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు.

# పుస్తకాలు ఇచ్చి ఎమ్మెల్యేకు అభినందనలు



నర్సీపట్నంః నర్సీపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర గణేష్‌ను పెదబొడ్డేపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు లెక్కల శ్రీనివాసరావు, సిబ్బంది కలిసి పుస్తకాలు అందజేసి బుధవారం శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్ రుత్తల రాజాచంద్ర, ఉపాధ్యాయులు, తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



డాబాగార్డెన్స్: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ ,బిసి వర్గాలకు చెందిన పేద విద్యార్థులకు రావలసిన సుమారు 200 కోట్ల రూపాయల ఉపకార వేతనాలను శ్రీ చైతన్య జూనియర్ కాలేజీ యాజమాన్యం సొంతం చేసుకుందని స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి వాసు పేర్కొన్నారు. బుధవారం నగరంలో ఓ హోటల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం రెండు సంవత్సరాలకు 4,200 చొప్పున స్కాలర్‌షిప్ ఇస్తోందని, ఆ మొత్తాన్ని కాలేజీ యాజమాన్యాలు అకౌంట్లోనే ప్రభుత్వం జమ చేస్తోందని, కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు చెక్కు రూపంలో ఈ నగదు ఇవ్వాలని, కానీ శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఈ నగదు అందటం లేదంటూ బాధిత విద్యార్థులతో కలసి వాసు ఆరోపించారు. ఈ స్కాంలో ఎస్సీ, ఎస్టీ, బిసి సంక్షేమ శాఖలకు చెందిన అధికారులకు కూడా వాటా ఉందంటూ వారు ఆరోపించారు. ఈ ఉదంతంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టి సారించి విద్యార్థులకు తగిన న్యాయం చేయాలని వారు కోరారు.

# ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

- డీమార్ట్, వాల్‌మార్టు లాంటి సంస్థల్లో కార్మికులకు పని కల్పించాలి
- సిఐటియు అధ్యక్షుడు ఆర్కేఎస్వీకుమార్



విశాఖ సిటీః ముఠా కళాసీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర చట్టం చేయాలని సిఐటియు గ్రేటర్ విశాఖనగర అధ్యక్షులు ఆర్.కె.ఎస్.వి.కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. బుధవారం విశాఖ జిల్లా ముఠా వర్కర్స్ యూనియన్, సిఐటియు నగర విస్తృత సమావేశం జగదాంబ వద్ద నండూరి ప్రసాదరావు భవనంలో పైడిరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి కుమార్ పాల్గొని మాట్లాడుతూ గత ఇరవై ఏళ్ళ నుండి ముఠాకార్మికులకు సమగ్ర చట్టం చేయాలని అనేక పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ఎన్నికల్లో రాజకీయపార్టీలు అధికారంలోకి సమగ్ర చట్టం తీసుకువస్తామని కాంగ్రెస్, తెలుగుదేశం రెండూ హామీలిచ్చి మోసం చేసాయని విమర్శించారు. నేడు వైఎస్ఆర్ కాంగ్రెస్ కూడా ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ముఠా కళాసీలకు నేటికీ కార్మిక చట్టాలు ఏమీ వర్తించడం లేదన్నారు. కనీసం ప్రభుత్వం ఇఎస్ఐ, పిఎఫ్, పెన్షన్ సౌకర్యంతో పాటు కళాసీల పిల్లలకు కేజి నుండి పిజి విద్య ఉచితంగా అందించాలన్నారు. ముఠా కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి వారి సంక్షేమానికి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసారు. అలాగే విశాఖపట్నంలో డీమార్టు, వాల్‌మార్టు, స్పెన్సర్ వంటి పెద్ద పెద్ద షాపింగ్‌మాల్స్ వచ్చిన తరువాత చిన్న వ్యాపారస్తులు దివాళాతీయడంతో ముఠా కళాసీలు పనులను కోల్పోతున్నారని తెలిపారు. పెద్ద పెద్ద షాపింగ్‌మాల్స్‌లో కళాసీలకు పనులకు అవకాశం కల్పించాలని అన్నారు.

ఈ సమావేశంలో విశాఖ జిల్లా ముఠా వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బారావు, సిఐటియు జగదాంబ జోన్ అధ్యక్షులు వై.రాజు, మద్దిలపాలెం జోన్ అధ్యక్షులు వి.కృష్ణారావు, ముఠా మేస్త్రిలు పాల్గొన్నారు. సమావేశానికి ముందు సిఐటియు కర్నాటక అధ్యక్షులు మాధవ మృతికి సంతాపం తెలియజేసారు.

## ఘనంగా రాచపోలమాంబ ఉత్సవాలు



విశాఖ సిటీ :అల్లిపురం లోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద వెలసియున్న రాచపోలమాంబ గ్రామ దేవత అమ్మ వారి పండుగ మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ నెల రోజులు ఉత్సవాలు సాగుతుందన్నారు జులై 18 చివరి రోజున విద్యుత్ అలంకరణలు, అగ్నిగుండము, నేల వేషాలు, అష్టలక్ష్మి, కోలాటాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. నగర ప్రజలందరూ అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలను పొందాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు. జులై 28న భారీ అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. ప్రజలందరూ ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కేశవ, ఎల్లపు శ్రీనివాస్, తిరుమలరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, భవాని శంకర్ రెడ్డి, రవికుమార్, రవి నాయక్ ,రాము ,ప్రతాప్ కుమార్, మల్ల శ్రీను, రాజు, కోదండ రమేష్ రెడ్డి, ధనరాజ్, రాము తదితరులు పాల్గొన్నారు.

## ఇస్కాన్‌పై సిబిఐచే విచారణ జరిపించాలి

- మధ్యాహ్న భోజన నిర్వహణ నుండి ఇస్కాన్‌ను తొలగించాలి
- సిఐటియు డిమాండ్

సాగర్‌నగర్ః మధ్యాహ్న భోజన పథకం బియ్యాన్ని అక్రమ నిల్వ, విదేశాలకు ఎగుమతి చేస్తున్న "ఇస్కాన్" సంస్థపైన నిర్వాహకులపైన సమగ్ర విచారన జరిపి, కఠిన చర్యలు తీసుకోవాలని సిఐటియు విశాఖ జిల్లా, నగర కమిటీలు డిమాండ్ చేస్తున్నది. అక్రమాలకు పాల్పడుతున్న ఇస్కాన్‌ను మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ నుండి తొలగించి ప్రభుత్వమే నిర్వహించాలని కోరుతున్నాం. విశాఖపట్నం సాగర్‌నగర్‌లో ఉన్న " ఇస్కాన్" సంస్థ మధ్యాహ్న భోజనం పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న బియ్యాన్ని అక్రమంగా నిల్వచేసి, వాటిని కాకినాడ పోర్టు ద్వారా ఇండోనేషియాకు ఎగుమతి చేస్తున్న వాటిని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గుర్తించి మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. 110 బస్తాల బియ్యాన్ని ఎగుమతి చేస్తున్న ఎ.పి.31 టిటి 0457 నెంబర్ గల లారీని స్వాధీనం చేసుకున్నారు. దీనితో పాటు ఇస్కాన్ సంస్థలో ఎగుమతికోసం తరలించడానికి సిద్ధంగా ఉన్న మరో 288 బ్యాగులను మొత్తం 398 బస్తాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అక్షయపాత్ర ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, జివిఎంసి పరిధిలో ఉన్న స్కూళ్లకు భోజనాన్ని సరఫరా చేస్తున్న ఇస్కాన్ సంస్థకు ఉచిత మధ్యాహ్న భోజన పథకం బియ్యం ఏవిధంగా వచ్చాయి. వీటిని ఇస్కాన్ సంస్థ ఎగుమతి చేయడం వెనుక ఉన్న వ్యవహారంపై "సమగ్ర విచారణ" జరిపిం చాలి. ఈ అక్రమాలకు పాల్పడుతున్న ఇస్కాన్ సంస్థపైన, నిర్వాహ కులపైన క్రిమినల్ చర్యలు చేపట్టాలని సిఐటియు డిమాండ్ చేస్తున్నది.

# సైనిక కుటుంబాల విద్యా వేదిక ఏయూ

### వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు




ఆంధ్ర విశ్వవిద్యాలయంః ఏ.యూ. దేశ రక్షణ కోసం పనిచేస్తున్న త్రివిద దళాల సిబ్బందికి, కుటుంబ సభ్యులకు విద్యను అందించే వేదికగా ఆంధ్రవిశ్వవిద్యాలయం నిలుస్తోందని ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు అన్నారు. బుధవారం ఉదయం ఏయూ మెట్రాలజీ, ఓషనో గ్రఫీ విభాగంలో నిర్వహిస్తున్న డిప్లమో ఇన్ సేఫ్టీ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కోర్సును ఆయన ప్రారంభించారు. వర్సిటీ రక్షణ దళాల ఉద్యోగులకు అంది స్తున్న 25వ బ్యాచ్‌గా ఈ బ్యాచ్ నిలుస్తుందన్నారు. విశాఖపట్నం రక్షణ రంగాల ఉద్యోగుల హబ్‌గా నిలుస్తుందన్నారు., ఏడాది కాలంలో 5 వేల మంది రక్షణ రంగాల ఉద్యోగులకు వివిధ కోర్సుల్లో శిక్షణ అందించడం జరిగిందన్నారు. సర్టిఫికేట్ కోర్సులు, బిఎస్సీ, పిజి డిప్లమో ఇన్ మేనేజ్‌మెంట్, పీజీ డిగ్రీలతో పాటు, పిహెచ్‌డిలలో ప్రవేశాలు కల్పించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎం.ప్రసాద రావు, సైన్స్ కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ వి.వి నాగేశ్వర రావు, విభాగాధిపతి పి.సునీత తదితరులు పాల్గొన్నారు.

# పెరగనున్న భద్రాచలం బెల్లం లడ్డూ ధర

భద్రాచలం : రామాలయంలో 100 గ్రాముల బెల్లం లడ్డూని రూ.20కి విక్రయిస్తుండగా దీన్ని 80 గ్రాములకు తగ్గించడంతో పాటు ధరను రూ.25 చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఇప్పటికే ప్రకటిం చగా ఆ శాఖ కమి షనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలు వడ్డాయి. రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో బెల్లం ప్రసాదాలను కొద్ది రోజు లుగా విక్రయిస్తుండగా ఇందులో లడ్డూ ధర విషయంలో స్పష్టత లేదు. ఎవరికి అనుకూలమైన ధరతో వాళ్లు విక్రయాలు చేపడుతున్నారు.

ఇక నుంచి అన్ని ఆలయాల్లో ఒకే ధర అమలు కానుంది. భద్రగిరిలో లడ్డూలకు వాడే బెల్లం ధర పంచదార కన్నా ఎక్కువ ఉంటుంది. నెయ్యి కూడా ఎక్కువ పడుతుందని అంచనా.

# గీతం 'వర్సిటీలో నైపుణ్య శిక్షణా కేంద్రం ఏర్పాటు

### ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ శివప్రసాద్



సాగర్‌నగర్ః ఇంజనీరింగ్ విద్యను అభ్యసించే విద్యార్థులలో నిపుణతను పెంచడానికి ఉద్యోగ అవకాశాలను, విస్తృతం చేయడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయునున్నట్లు ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎన్.శివప్రసాద్ వెల్లడించారు. గీతం ఇంజనీరింగ్ కోర్సులలో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులు, తల్లితండ్రులకు బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. పరిశ్రమల అవసరాలను గుర్తించి నిపుణుల సూచనల మేరకు ఇంజనీరింగ్ సిలబస్‌లో మార్పులు చేశామని ఆయన తెలిపారు. ఇంజనీరింగ్ కోర్సుల ద్వారా వృత్తి నిపుణత సాదించే దిశగా విద్యార్థులు తమ వ్యక్తిత్వాన్ని మలచుకోవాలని సూచించారు. తరగతి గదిలో హజరుకు ప్రాధాన్యత ఇవ్వాలని, కాలానుగుణంగా ఐటి రంగంలో సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను ఆకళింపు చేసుకోవాలని సూచించారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ ప్రాంగణ నియామకాలలో గీతం విశ్వవిద్యాలయం విద్యార్థులు కొత్త రికార్డులు సృష్టిస్తున్నారని, విద్యార్థుల మానసిక స్థాయిని, ఆలోచనా పరిధిని పెంచేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. తల్లితండ్రుల సహకారంలో ఉత్తమ ఇంజనీర్లను దేశానికి అందించేదిశగా ప్రణాళికాయుతంగా ముందుకు సాగుతున్నామన్నారు.

వివిధ రాష్ట్రాలనుంచి పెద్ద ఎత్తున హజరైన తల్లితండ్రులు, విద్యార్థులతో గీతం విశ్వవిద్యాలయం సందడిగా మారింది.కాగా విద్యార్థుల కోసం విస్తృత ఏర్పాట్లు చేసినట్లు విశ్వవిద్యాలయం రిజస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ తెలిపారు.ప్రవేశం పొందిన విద్యార్థులందరికి హస్టల్ వసతితో పాటు ఐడి కార్డులను, బస్‌పాస్ అందించటం కోసం ప్రత్యేక కౌంటర్‌లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అడ్మిషన్‌ల డైరక్టర్ ప్రొఫెసర్ కె.నరేంద్ర, విద్యార్థి వ్యవహారాల విభాగం సయుక్త డైరక్టర్ ప్రొఫెసర్ వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఈస్ట్ కోస్ట్ రైల్వే
WD829-Sand III - 2019-20
(DLS)
210
₹ 14,79,170/-
₹ 29,600/-
₹ 2,360/-
210
11.07.2019
http://www.ireps.gov.in
10
PR-188/K/19-20

# విజయభాను సంపాదకీయం

## నెరవేరిన లక్ష్యం

ప్రజా ఉద్యమం పేరుతో అంతిమంగా అమెరికా లక్ష్యం నెరవేరింది. తమకు వ్యతిరేకంగా ఉన్న బషీర్ ప్రభుత్వాన్ని కూల్చివేయడంతోపాటు తమకు అనుకూలంగా ఉండే సైనిక ప్రభుత్వాన్ని నెలకొల్పగలిగింది. బహిరంగంగా అమెరికా సూడాన్ వ్యవహారాలతో సంబంధం లేనట్టు వ్యవహరిస్తున్నది. హింసాకాండను ఖండిస్తూ శాంతిని నెలకొల్పాలని పిలుపు ఇస్తున్నది. మరోవైపు సౌదీ అరేబియా, యునైటెడ్ ఎమిరేట్స్, ఈజిప్టు మొదలైన దేశాల ద్వారా సూడాన్‌లోని సైనిక ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నది. అరబ్బు ప్రాంతమంతా వైషమ్యాలతో అట్టుడుకుతున్న తరుణంలో ఈశాన్య ఆఫ్రికాలోని సూడాన్‌లో తలెత్తిన సంక్షోభం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. ప్రజాస్వామ్య ఉద్యమకారులపై సైనిక ప్రభు త్వం కాల్పులు జరుపడంతో 113 మంది మరణించారు. వందలాది మంది గాయపడ్డారు. సూడాన్‌లో సైనిక ప్రభుత్వానికి, ప్రజాస్వామ్యవాదులకు పోరాటం సాగుతున్న మాట నిజమే. కానీ తరచిచూ స్తే ఇందులో విదేశీ శక్తుల ప్రమేయమే ప్రధానమైందిగా కనబడుతున్నది. సిరియా, లిబియాల మాదిరిగానే సూడాన్ సంక్షోభంలోకి జారుకుంటున్నదనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. కొంతకాలంగా సూడాన్ ఎదుర్కొంటున్న సంక్షోభానికి మూలం అమెరికా విధించిన ఆంక్షలే. ఈ ఆంక్షల మూలంగా తంటాలు పడుతున్న సూడాన్‌కు ఐఎంఎఫ్ మరికొన్ని షరతులు విధించింది. సబ్సిడీలు ఎత్తివేయాలని, సంక్షేమ పథకాలు తగ్గించుకోవాలని సూచించింది. ఇంధనం, ఆహారంపై సబ్సిడీలు ఎత్తివేయడంతో దేశాధ్యక్షుడు ఒమర్ అల్ బషీర్‌కు వ్యతిరేకంగా నిరసనలు మొదలయ్యా యి. నిరసనలను అణిచివేసేందుకు అధ్యక్షుడు బషీర్ గతేడాది డిసెంబర్‌లో ఎమర్జెన్సీ విధించాడు. ముప్పై ఏండ్లుగా అధికారంలో ఉన్న బషీర్ రాజీనామా చేయాలంటూ ఉద్యమం తీవ్రమైంది. ఉద్యమకారులకు నాయకత్వం వహిస్తున్న కొన్నివర్గాలు ప్రభుత్వాన్ని కూలదోయవలసిందిగా సైన్యాన్ని కోరడం విచిత్రం. దీనివల్ల మొత్తం ప్రజా ఉద్యమమే పక్కదోవ పట్టింది. సైన్యం అధికారాన్ని చేజిక్కించుకొని ప్రజాస్వామ్యాన్ని స్థాపిస్తుందనే అభిప్రాయాన్ని కలిగించారు. బషీర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన వైద్యులు, న్యాయవాదులు ఇతర వృత్తులవారు ఇప్పుడు సైనిక పాలనకు వ్యతిరేకంగా ఉద్యమం సాగించవలసి వస్తున్నది. ప్రజా ఉద్యమాన్ని సాకుగా చూపి బషీర్ ప్రభుత్వాన్ని కూలదోసిన సైన్యం మొదట్లో ఉద్యమకారులతో ఒప్పందానికి వచ్చింది. మూడేండ్ల పాటు పరివర్తనా ప్రభుత్వం ఏర్పడి, పాత వ్యవస్థ అవశేషాలు తొలిగించిన తర్వాత ఎన్నికలు జరుపాలనేది సైనిక ప్రభుత్వానికి, ఉద్యమకారులకు మధ్య కుదిరిన ఒప్పందం. ఎన్నికలు జరిపే వర కు సార్వభౌమ మండలి, మంత్రిమండలి, శాసనసభ ఉండాలనే అంగీకారం కుదిరింది. పరిపాలనారంగంలో తమ పాత్ర ఉంటుందని ప్రజాస్వామ్యవాదులు భావించారు. కానీ సైనికాధికారుల వైఖరి మారిపోయింది. దీంతో సైనిక ప్రభుత్వానికి వ్యతిరేకంగా మళ్ళా ఉద్యమం మొదలైం ది. సైనిక పాలకులు ఉద్యమకారులతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్టు ప్రకటించి ప్రదర్శకులపై తీవ్రంగా అణిచివేత ప్రారంభించారు. ప్రజాస్వామ్య ఉద్యమకారుల పరిస్థితి పెనంపై నుంచి బొర్లి పొయ్యిలో పడ్డట్టయింది. ప్రజా ఉద్యమం పేరుతో అంతిమంగా అమెరికా లక్ష్యం నెరవేరింది. తమకు వ్యతిరేకంగా ఉన్న బషీర్ ప్రభుత్వాన్ని కూల్చివేయడంతోపాటు తమకు అనుకూలంగా ఉండే సైనిక ప్రభుత్వాన్ని నెలకొల్పగలిగింది. బహిరంగంగా అమెరికా సూడాన్ వ్యవహారాలతో సంబంధం లేనట్టు వ్యవహరిస్తున్నది. హింసాకాండను ఖండిస్తూ శాంతిని నెలకొల్పాలని పిలుపు ఇస్తున్నది. మరోవైపు సౌదీ అరేబియా, యునైటెడ్ ఎమిరేట్స్, ఈజిప్టు మొదలైన దేశాల ద్వారా సూడాన్‌లోని సైనిక ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నది. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కువైట్ వంటి దేశాలు అమెరికా వైపు ఉండగా, ఇరాక్, లిబియా, సిరియా వంటి దేశాలలో అరబ్బు జాతీయవాదం, సామ్యవాదం, పాశ్చాత్య వలసవాద వ్యతిరేకత ప్రాతిపదికగల ప్రభుత్వాలు ఉండేవి. ఇప్పుడు అమెరికా ఆధిపత్యానికి ఎదురులేకపోవడంతో అరబ్ దేశాలలో తమకు వ్యతిరేకంగా ఉన్న పాలకవ్యవస్థలను కూలదోయాలని, దేశాల భౌగోళిక స్వరూపాలను మార్చాలని ప్రయత్నిస్తున్నది. ఇరాన్‌పై ఆంక్షలు విధించిన అమెరికా మరోవైపు సౌదీ అరేబియా తదితర దేశాల ద్వారా అస్థిరత్వాన్ని వివిధ దేశాలలో సంక్షోభాన్ని సృష్టిస్తున్నది. హౌతీలో అంతర్యుద్ధం ఇందుకు ఉదాహరణ? హౌతీలో ప్రభుత్వాన్ని కూలదోయడానికి సౌదీ అరేబియా ద్వారా అంతర్యుద్ధాన్ని సృష్టించింది.

# ఈ జీవి కిలో ఉమ్ము విలువ రూ.1.70కోట్లు!



ముంబయి: ఆ జీవి ఉమ్ము విలువ ఏకంగా కోట్లలో ఉంటుందట. దీన్ని కలిగి ఉండడం నేరం కూడానట. తాజాగా ముంబయిలో దీన్ని కలిగి ఉన్నందుకు ఇద్దరు వ్యక్తుల్ని అరెస్టు చేశారు. ఒక కిలో ఉమ్ముని బహిరంగ మార్కెట్లో అమ్మడానికి ప్రయత్నిస్తుండగా.. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఇంతకీ దాని విలువ ఎంతో తెలుసా..? అక్షరాలా ఒక కోటి డెబ్భై లక్షలు. అవును మీరు విన్నది నిజమే. వివరాల్లోకి వెళితే..

స్పెర్మ్ వేల్ (తిమింగలాల్లో ఒక జాతి) అనే సముద్ర జీవి ఒక రకమైన మైనం లాంటి పదార్థాన్ని నోటి ద్వారా వదులుతుంది. దీన్ని ఆంగ్లంలో యాంబర్‌గ్రిస్ అంటారు. ఇది దాని పేగుల్లో ఉత్పత్తి అయ్యే ఒకరకమైన ద్రవ పదార్థం. సాధారణంగా స్పెర్మ్ వేల్స్ ఉష్ణమండల సముద్రాలలో దీన్ని వదులుతాయి. దీన్ని అత్యంత ఖరీదైన సుగంధ ద్రవ్యాల్లో ఉపయోగిస్తారు. అందుకే దీనికి అంత విలువ. అనుమతులు లేకుండా దీన్ని కలిగి ఉండడం చట్టరీత్యా నేరం.

తాజాగా నాగ్‌పూర్‌కు చెందిన రాహుల్ తుపారే(53), అనే వ్యక్తి ఆ యాంబర్ గ్రిస్‌ను సంపాదించి ముంబయి మార్కెట్లో అమ్మడానికి ప్రయత్నించాడు. సమాచారం అందుకున్న ఘట్కోపర్ ఠాణాకు చెందిన పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని అతన్ని అరెస్టు చేశారు. విచారణలో భాగంగా తనకు ఆ పదార్థాన్ని అమ్మిన గుజరాత్‌కు చెందిన లలిత్ వ్యాస్ అనే వ్యక్తి పేరు వెల్లడించారు. అనంతరం నిపుణులను సంప్రదించి దాన్ని పరీక్షించగా.. అది యాంబర్‌గ్రిస్ అని తేలింది. దీన్ని కనుగొనడం చాలా కష్టతరమైన పని అని వారు తెలిపారు. గల్ఫ్‌లో దీనికి బాగా డిమాండ్ ఉండడంతో అక్రమంగా అక్కడికి తరలించి విక్రయిస్తుంటారని పేర్కొన్నారు. అయితే ఈ యాంబర్‌గ్రిస్‌ను మండిస్తే ధనవంతుల వుతారనే ఒక మూఢనమ్మకం కూడా ప్రజల్లో ఉంది.

# దుర్గగుడి ఆధ్వర్యంలో వరుణయాగం

విజయవాడ: విరివిగా వర్షాలు కురిసి రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలని ఆకాంక్షిస్తూ విజయవాడలోని దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో వరుణ యాగం నిర్వహిస్తున్నట్లు ఈవో కోటేశ్వరమ్మ వెల్లడించారు. ఈ నెల 20 నుండి 24 వరకు వరుణ యాగం జరగనుంది. గురువారం నుంచి 22వరకు ఉదయం 6 గంటల నుంచి ఉదయం 8గంటల వరకు దేవస్థానానికి చెందిన వేద విద్యార్థులు, అర్చకులతో పారాయణం నిర్వహించ నున్నారు. ఈ నెల 23న ఉదయం 7 నుంచి 11గంటల వరకు మండప ఆరాధనలు ఉంటాయని చెప్పారు. ఈ నెల 24న ఉదయం 6గంటల నుంచి 11 వరకు సహస్ర ఘటాభిషేకం జరుగుతుందని కోటేశ్వరమ్మ తెలిపారు.

# నా పులి బిడ్డ ఎక్కడికెళ్లాడు?

## కన్నీరు పెట్టించిన జవాను తల్లి రోదన



అనంత్‌నాగ్: ప్రాణాలను పణంగా పెట్టి దేశ సరిహద్దుల్లో గస్తీ కాచే జవాన్ల సేవలకు వెల కట్టలేం. మళ్లీ వస్తాను అని నవ్వుతూ చెప్పి వెళ్లిన బిడ్డ..తిరిగి విగత జీవిగా ఇంటికొస్తే ఏ తల్లి మాత్రం తట్టుకోగలదు!. అలాంటి పరిస్థితే రెండు రోజుల క్రితం ఉగ్రవాదుల ఎదురు కాల్పు ల్లో ప్రాణాలు కోల్పోయిన ఆర్మీ మేజర్ తల్లికి ఎదురైంది. 19 రాష్ట్రీయ రైఫిల్స్ విభాగంలో పనిచేసే మేరఠ్‌కు చెందిన ఆర్మీ మేజర్ కేతన్ శర్మ ఉగ్రవాదుల ఎదురు కాల్పుల్లో అమరుడయ్యారు. ఆయన మృతదేహాన్ని అధికారులు ఇంటికి చేర్చారు. కేతన్‌ను విగత జీవిగా చూసిన కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. నా పులి బిడ్డ ఎక్కకెళ్లాడో చెప్పండి? అంటూ కేతన్ తల్లి రోదిస్తున్న తీరు అక్కడున్న వారిని కంట తడిపెట్టించింది.

అమరుడైన ఆర్మీ మేజరుకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. అంతకు ముందు ఆయన మృతదేహాన్ని మేరఠ్‌లోని కంటోన్మెంట్ ఏరియాలో ఉంచారు. కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ ఆయనకు నివాళులు అర్పించారు. జమ్ముకశ్మీరులోని అనంత్‌నాగ్‌లో సోమవారం ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. దక్షిణ కశ్మీర్‌లో ఉగ్రవాద అలికిడి గురించి తెలుసుకున్న భారత సైన్యం అక్కడ పెద్ద ఎత్తున భద్రత ఏర్పాటు చేసింది. దీన్ని పసిగట్టిన ఉగ్రమూకలు సైన్యంపై ఎదురుకాల్పులకు దిగారు. అప్పటికే అప్రమత్తమయిన భారత సైన్యం వారి చర్యలను తిప్పికొట్టింది. ఈ ఘటనలో ఒక ఉగ్రవాదిని మట్టుబెట్టింది. ఎదురు కాల్పుల సమయంలో ఆర్మీ మేజర్ కేతన్ శర్మ తీవ్రంగా గాయపడ్డారు. అధికారులు ఆయనను ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ తుది శ్వాస విడిచారు.

# నలుగురు ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం

హైదరాబాద్: నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీలతో తెలంగాణ శాసనమండలి ఉపాధ్యక్షుడు నేతి విద్యాసాగర్ ప్రమాణం చేయించారు. వైస్ ఛైర్మన్ ఛాంబర్‌లో.. శాసనమండలి సభ్యులుగా పట్నం మహేందర్‌రెడ్డి, తెర చిన్నపరెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌కుమార్ లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. అంతకు ముందు ఎమ్మెల్సీలు గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళు లర్పించారు. ప్రజాసేవ చేసేందుకు అవకాశం కల్పించిన ప్రజలకు, సీఎం కేసీఆర్‌కు మహేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ నేత భట్టి విక్రమార్క, ఇతర ఎమ్మెల్యేలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి దయాకర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడేళ్లలో కాళేశ్వరం పూర్తి చేసిన మహాత్ముడు కేసీఆర్ అని కొనియాడారు.

# సమకాలం

## 'ప్రభంజనం'

మగాడంటే... మగాడు
అతననే మగాడు-ప్రభంజనాన్ని సృష్టించాడు.
కన్నవారి ఆశయం నెరవేర్చిన మగాడు.
వీరాధి - వీరుడై;
ధీరాది-ధీరుడై-వీరమార్తాండై;
మనుష్యులో మగమహారాజైయ్యాడు.
జగంబును ఏలే జగన్
జగననే - జగంబుగ సృష్టించాడు... ॥మగా॥
పాదయాత్ర పుణ్యామో!
కన్నతల్లి ధీవెనలో!
కన్నతండ్రి స్వర్గాశీస్సులో!
భార్యదిద్దె నుదుట తిలకం బొట్టు
మహాత్యమో!
ఎదురొచ్చే సోదరి వేళా విశేషమో!
వరించిది 'ఆంధ్రా' సింహాసన దరహాసం... ॥మగా॥
ఎండల బాధ తట్టుకోలేక
వడగాల్పులకు చావలేక
జనులు ఫ్యాన్ గాలి కోరారు.
ఇంటింటా- ప్రతీ ఇంటా!
ఫ్యాన్ గాలి బాగా వీచింది.
ఆంధ్రావనిని హాయిని గొల్పింది... ॥మగా॥
ఏసుక్రీస్తుని ఎలా హింసించి శిలువను వేశారో!
ఆ హింసను పొందాడు
అలాంటోడు- ఇలాంటోడు
అన్నోళ్ల నోర్లు- ఊపిరాడక
ఉక్కిరి-బిక్కిరి చేసింది ఫ్యాన్ గాలి.
'ఈ దారలో సారం ఇంతేనయా!"
విషద గీతం పాడుకొన్నారు కొందరు.
చంద్రుడ్నే - అమావాస్య చంద్రుణ్ణిగా చేశాడు... ॥మగా॥
అవ్వలను కలిశాడు... బువ్వలను తిన్పించారు
తాతయ్యలను కలిశాడు... కరుణనను పొందాడు
సోదరీ-సోదరమణులను కలిశాడు... మమతను పొందాడు
వారి బాధలు చూశాడు
వారి ఋణం ఎం చేసి- ఎలా తీరుస్తాడో!
జయీభవ- విజయీభవ జగన్... ॥మగా॥

...కవితా రచన
యల్.సిద్ధా

# పంచాంగం

మాసం : జ్యేష్ఠ; తిథి : బ. తదియ ప.3.41; ఉత్తరాషాడ ప.2.56; రా.వ.7.17ల 9.02 | గురువారం 20-06 -2019

**మేషం** : చేపట్టిన పనులు నిర్విఘ్నంగా పూర్తి చేస్తారు. సామాజిక కార్య క్రమాల పట్ల ఆసక్తితో వ్యవహరిస్తారు. కళ, క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుంటారు. క్రీడలు, పోటీల్లో రాణిస్తారు. ప్రముఖులతో పరిచయాలు పెంచుకుంటారు. శ్రీమతి శ్రీవారు ఆరోగ్య విషయంలో ఆందోళన పడతారు. రాజకీయ వ్యక్తులకు చికాకులు తప్పవు. **వృషభం** : నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. స్పెక్యులేషన్ కలిసి వచ్చును. మీ లక్ష్యసాధనకు ప్రముఖులు, ప్రభుత్వ అధికారుల సహకారం అందు తుంది. ఆత్మీయులతో ఉల్లాసంగా గడుపుతారు. విందులు, వినోదాల్లో పాల్గొం టారు. అవివాహితులకు అనుకూలం. కొత్త పరిచయాలు ఏర్పడతాయి. **మిధునం** : ఇతరులపై ఆధార పడక స్వశక్తితోనే మీ పనులు పూర్తి చేసుకోవడం శ్రేయస్కరం. చిన్నారులు, ప్రియతముల ఆరోగ్యంపై దృష్టిసారిస్తారు. వాహనం నడుపుతున్నపుడు ఏకాగ్రత వహించండి. ఆత్మీయులకు ఒక ముఖ్య సమాచారం అందించడం వల్ల మీ గౌరవ ప్రతిష్టలు ఇనుమడిస్తాయి. **కర్కాటకం** : వైద్య రంగంలో వారికి శ్రేయస్కరం. తలపెట్టిన పనులలో విఘ్నాలు, చీటికి మాటికి అసహనం ఎదుర్కొంటారు. మిత్రులలో ఒకరికి వీడ్కోలు పలుకుతారు. స్త్రీలకు చుట్టు ప్రక్కల వారితో సత్సంబంధాలు నెలకొంటాయి. విద్యార్థులలో నూతనోత్సాహం చోటు చేసుకుంటుంది. వాహన యోగం పొందుతారు. **సింహం** : ఖర్చులు అధికంగా ఉంటాయి. వృత్తి, వ్యాపారాలకు సంబంధించిన ఒక నిర్ణయం తీసుకుంటారు. ఆడిటర్లకు విశ్రాంతి లభించును. రాబడికి మించిన ఖర్చులు పెరగడంతో ఒకింత ఆందోళనకు గురవు తారు. స్త్రీలకు కళాత్మక రంగాల పట్ల ఆసక్తి పెంచుకుంటారు. వ్యాపారాభివృద్ధికి నూతన ప్రణాళికలు, పథకాలు అమలు చేస్తారు. **కన్య** : కుటుంబీకుస మధ్య కొత్త విషయాలు చర్చకు వస్తాయి. మార్కెటింగ్ రంగాల్లో వారికి అనుకూలత. నిరుద్యోగులతు ఆశాజనకం. దైవ, శుభకార్యాల్లో చురుకుగా వ్యవహరిస్తారు. స్త్రీలు కళాత్మక రంగాల పట్ల ఆసక్తి పెంచుకుంటారు. వ్యాపారాభివృద్ధికి నూతన ప్రణాళికలు, పథకాలు అమలు చేస్తారు. **తుల** : ప్రేమికుల మధ్య అభిప్రాయభేదాలు తలెత్తవచ్చు. వాహన చోదకులు వాహనం నడుపునపుడు మెలకువ వహించండి. ఆత్మీయులతో విందులు, పలు కార్యక్రమాలలో పాల్గొంటారు. వస్త్ర, బంగాలు, వెండి, లోహ, రత్న వ్యాపారస్తులకు పురోభివృద్ధి. ప్రముఖుల కలయిక ప్రయోజనకరంగా ఉంటుంది. **వృశ్చికం** : స్త్రీలకు అపరిచిత వ్యక్తుల విషయంలో మెలకువ అవసకం. చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారు. ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. వృత్తి, వ్యాపారులకు సంతృప్తి, పురోభివృద్ధి.

# బాబాను దర్శించిన యోగులు

## సంకీర్తన

మాతృశ్రీ అనసూయదేవి

దివ్యత్వంతో తాదాత్మ్యత పొంది నిరంతరం బ్రహ్మానంద పారవశ్యంలో నిమగ్నమై ఉండే ప్రేమ స్వరూపిణి మాతృశ్రీ అనసూయదేవి. బాపట్లకు 12 కి.మీ. దూరంలోని జిల్లెళ్ళమూడిలో ఆ తల్లి నివసించేవారు. అందువల్ల ఆ తల్లికి 'జిల్లెళ్ళమూడి అమ్మ' అని పేరు వచ్చింది.

ఆ తల్లి 1923 మార్చి 28వతేదీనాడు జన్మించారు. ఏకాంతంగా ఉన్నప్పుడు ఆ తల్లి నేలపై ఆనకుండగా భూమికి రెండడుగుల ఎత్తులో యోగముద్రలో కూర్చొని ఉండటం ఒకనాడు ఇంటివారు గమనించి ఆశ్చర్యచకితులై ఈమె సాధారణ స్త్రీ కాదని, కారణజన్మురాలని తెలుసుకున్నారు. పెద్ద కుంకుమబొట్టు పెట్టుకొని, పట్టుచీన కట్టుకొని, చిరునగవులు చిందిస్తూ, కళకళలాడుతూ ఉన్న అనసూయదేవిని భక్తులు రాజరాజేశ్వరీదేవిగా భావించి ఆమెను పూజించేవారు. ఆమె తనను దర్శింపవచ్చిన ప్రతి వ్యక్తిని ప్రేమతో, ఆప్యాయతతో పలుకరించి భోజనం చేసి వెళ్ళమనేవారు. ఆ అన్నపూర్ణాలయంలో ఎప్పుడూ అన్న సంతర్పణ జరుగుతూనే ఉండేది. అక్కడ భోజనం చేయటం వల్ల (అమ్మ అనుగ్రహం వల్ల) ఎందరికో శారీరక రుగ్మతలు మటుమాయమై శాంతి చేకూరేది. ఒకసారి ఒక సాధకుడు ఆ తల్లిని ఏదైనా ఉపదేశం చేయమని అడిగితే 'నేను పెట్టే ఆహారమే నా ఉపదేశం నాన్నా!' అన్నారు అమ్మ.

పళని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలోని నాడీ గ్రంథంలో బాబా గురించి వర్ణించే సందర్భంలో 'అదే సమయంలో ఆంధ్రదేశంలో అమ్మ ఉంటుంది. ఆమె పెద్ద కుంకుమబొట్టు పెట్టుకుంటుంది. ఆమె యోగిని!' అని పేర్కొనబడింది.

గురువర్యులు ప్రొ॥ కామరాజు అనిల్‌కుమార్ జిల్లెళ్ళమూడి అమ్మ దగ్గర తాము పొందిన అనుభవాన్ని ఇలా విశదీకరిస్తున్నారు. 'చాలా సంవత్సరాల క్రితం నన్ను జిల్లెళ్ళమూడి అమ్మ జన్మదినోత్సవానికి ఆహ్వానించారు. నేను అప్పుడు మన సాయి సంస్థల వైస్ ప్రెసిడెంట్‌గా ఉండేవాడిని. కార్యకర్తలకు స్పష్టంగా విన్నవించుకున్నాను. నా పేరుతో పాటు శ్రీ సత్యసాయి సంస్థల రాష్ట్ర ఉపాధ్యక్షుడని కూడా కరపత్రాలలో వేయించమని కోరాను. అని ఏప్రిల్ మాసం అనుకుంటాను. అమ్మ జన్మదినోత్సవం మండుటెండలు, వడగాల్పులు, అయినా మా గుంటూరు జిల్లా వారికి మండే ఎండలంటే లెక్కలేదు. ఎయిర్ కండిషన్డ్ అన్నమాట!

నేను, నా భార్య మధ్యాహ్నం జిల్లెళ్ళమూడికి చేరు కున్నాము. అమ్మ దర్శనానికి తీసుకువెళ్ళారు. అమ్మ మంచం మీద పడుకొని ఉన్నారు. ప్రక్కనే మనుమరాలు ఆడు కొంటున్నది. నన్ను చూసి అమ్మ 'వచ్చావా నాయనా! సంతోషం, మీ ఇద్దరు మా అబ్బాయి ఇంట్లో భోజనం చేయండి. సాయం కాలం నీ ఉపన్యాసానికి సభావేదికకు నే వస్తాన్లే' అన్నారు. 'అమ్మా! నా ప్రసంగంలో ప్రతి వాక్యానికి 'బాబా, బాబా ' అని వస్తుంది. మీ భక్తులు అన్యథా భావించరుగదా!' అన్నాను.

'అదేమిటి, అలా అంటు న్నావు? బాబావారి గురించే మాట్లాడు. విందామనే పిలిపించాను' అని అమ్మ అన్నారు. సాయంకాలం సభావేదిక మీద అమ్మ సింహాసనంపై కూర్చున్నారు.



...సశేషం



రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

## యాప్ వినియోగదారులకు స్కాచ్‌కార్డు

విశాఖపట్నం : వరల్డ్ కప్ 2019 ఘనంగా ప్రారంభమైన విజయవంతంగా కొనసాగుతున్న భారతదేశంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న గేమింగ్ వేదిక అయిన గేమ్స్ క్రా తన రమ్మీ కల్చర్ అభిమానులకు అద్భుతమైన స్కాచ్ కార్డు ఆఫర్లను అందిస్తుందని ప్రతినిధి కోమలి ఒక ప్రకటనలో తెలిపారు. ఆండ్రాయిడ్, ఐఓఎసపై అందుబాటులో ఉండే తన యాప్ నుంచి ఈ ఆఫర్ లో భాగంగా వినియోగదారులకు ప్రతీ గంటకు ఒక బహుమతిని గెలుచుకునే అవకాశాన్ని అందిస్తుందన్నారు. దీని ద్వారా అధిక పాయింట్లు సాధించిన వినియోగదారులకు వరల్డ్ కప్ 2019 పూర్తయ్యే లోపు ఆకర్షణీయమైన బహుమతులు అందిస్తుందన్నారు.

## కేంద్రమంత్రులను కలిసిన మంత్రి మల్లాడి

యానాం : ఇటీవల నూతన మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన కేంద్ర మంత్రులను మర్యాదపూర్వకంగా పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు కలిసి దుశ్శాలువాలతో సత్కరించారు పుదుచ్చేరి వ్యాప్తంగా ఉన్నటువంటి పలు సమస్యల పరిష్కారానికి సంబంధించి సంబంధిత కేంద్ర మంత్రులను కలిసి పుదుచ్చేరి అభివృద్ధికి,సంక్షేమానికి, ఉపాధికి, సహాయ సహకారాలు అందించాలని కోరారు పుదుచ్చేరి ఉండటంవల్ల కేంద్రం అందించే సహాయ సహకారాలతో మాత్రమే పుదుచ్చేరి అభివృద్ధి జరుగుతుందని దీనికి తప్పనిసరిగా సహకరించాలని అని కోరారు ప్రధానంగా హెల్త్, ఇరిగేషన్ తదితర శాఖల మంత్రులు కలిశానన్నారు.

## విద్యాదానం పేరుతో దారుణమైన మోసం



విశాఖపట్నం : పేద విద్యార్థుల తల్లిదండ్రులు వారి బిడ్డలకు చదివించేందుకు సహాయం చేస్తానని, ఆ పిల్లలను వారి తల్లిదండ్రులను దగా చేసి నట్టేట ముంచిన ఒక స్వచ్ఛంద సంస్థ వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఎంవీపీ కాలనీ, సెక్టర్-12 (ఉషోదయ జంక్షన్)లో వున్న 'మా ప్రేమ' అనే స్వచ్ఛంద సంస్థ పై చర్యలు తీసుకోవాలని బాధితులు కిడ్స్ గార్డెన్స్ పబ్లిక్ స్కూలు ప్రిన్సిపాల్ సాయిలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వాట్సప్, మెసెజ్‌లు, ప్రకటనలను ఇచ్చి 550మంది పిల్లల చదువులకు దాతలు ముందుకు రావాలని డబ్బులు వసూలు చేసిన నమ్మించి మోసం చేశారన్నారు. పిల్లల భవిష్యత్తులతో ఆడుకుని డబ్బులు సంపా దిస్తున్న ఇటువంటి సంస్థలపై కఠిన చర్యలు తీసుకోని, ప్రస్తుతం పాఠశాలలో అదోగతిలోవున్న విద్యార్థుల భవిష్యత్తును తీర్చి దిద్దాల్సిన బాధ్యత అధికారులపై వుందని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రతినిధులు బివి.రాజశేఖర్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## భీమిలి క్యాంపు కార్యాలయంలో మూడు మండలాల రివ్యూ సమావేశం



భీమునిపట్నం : పర్యాటక శాఖ మంత్రి మరియు భీమిలి శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు (అవంతి) భీమిలి క్యాంపు కార్యాలయంలో మూడు మండలాలు మరియు జి.వి.ఎం.సి అధికారులచే రివ్యూ మీటింగ్ జరిగింది. ఈ మీటింగులో అవంతి శ్రీనివాసరావు మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గంలో పెండింగ్స్ వర్క్ దానిపై ఒక యాక్షన్ ప్లాన్ తయారుచేయమని అధికారులను కోరారు. అదే విధంగా భీమిలి నియోజకవర్గంలో భూ స్థలాలు అక్రమంగా ఆక్రమించిన వాళ్లపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గంలో ఎటువంటి కరప్షన్ లేకుండా భీమిలిని అవినీతి రహిత నియోజకవర్గంగా చూడాలని, ఏ అధికారి కూడా లంచం తీసుకొని సస్పెండ్ అవ్వకూడదని అధికారులని ఉద్దేశించి మాట్లాడారు. అదే విధంగా నియోజకవర్గంలో త్రాగునీటి సమస్య, పిల్లల మ ధ్యా న భోజన పథకం, వాటియొక్క సమస్యలపై ఆరా తీశారు నియోజకవర్గంలో మినీ ఇండస్ట్రీస్ చిన్నతర పరిశ్రమలు ఏర్పాటు చెయ్యటం కోసం రెవెన్యూ ల్యాండ్స్ ఎన్నెన్ని అందుబాటులో ఉన్నాయో తెలియపరచమని అధికారులను కోరారు.

## అనంతగిరి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



అనంతగిరి : మండల కేంద్రంలో లో శ్రీ నూకంబిక అమ్మ వారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నుంచి శ్రీ సంతాన సాఫల్య సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభమయ్యాయి ఈ కార్యక్రమంలో మానాపురం సురేంద్ర శ్రీ లక్ష్మి దంపతులు మానాపురం కవిత దంపతులు శ్రీనివాస రావు పద్మావతి దంపతులు శ్రీనివాస్ జ్యోతి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు మొదటిరోజు గణపతి పూజ అ పుణ్యాహవాచనం సర్వ దేవత వాహనం వంటి పూజలు నిర్వహించారు గురువారం స్వామివారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించి అనంతరం అభిషేకాలు నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 21న శుక్రవారం ఉదయం ఏడు గంటలకు ఏడు గంటలకు విగ్రహ ప్రతిష్ట జరుగుతుందని అదే రోజు అన్న సంతర్పణ కార్యక్రమాలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు అప్పలరాజు సాయి ఆనంద్ శ్రీనివాస్ వెంకటేష్ తదితరులు తెలిపారు.

## 20న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉద్యోగ మేళా

సబ్బవరం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 20వ తేదీ గురువారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నామని జి.వి నీలిమ, పి.ఎస్.ఎన్ గురుప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగ మేళా స్వర్ణ భారతి ట్రస్టు గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉద్యోగ మేళాలో ఇంటర్మీడియట్ 55% మార్కులతో 2016-17-18-19 సంవత్సరాలలో పూర్తి చేసిన 22 ఏళ్ల వయస్సు కలిగిన వారు మేళాకు హాజరు కావాలని తెలిపారు.ఎంపికైన యువకులు రెండు నెలల పాటు ఫార్మా రంగానికి సంబంధించిన మెషిన్ ఆపరేషన్‌లో స్వర్ణ భారతి ట్రస్టు ఫార్మా పాఠశాల హైదరాబాదులో ఉచిత నైపుణ్య శిక్షణతో పాటు ఉచిత భోజన వసతి, ఉచిత పుస్తకాలు, దుస్తులు అందిస్తామన్నారు.

అభ్యర్థులు గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ విశాఖపట్నంలో ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. ప్రతీ విద్యార్థి అవసరమైన సర్టిఫికెట్స్, ఆధార్‌కార్డు జెరాక్సులతో హాజరు కావా లని మరిన్ని వివరాలకు 9848121498, 7893112024 ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

## ఫిట్‌నెస్ లేని బస్సులను నిలిపివేయబడును

**ఎంవిఐ పద్మాకర్**



పెద్దాపురం : పాఠశాలలు మరియు కాలేజీలకు విద్యార్థులను తీసుకుని వెళ్ళే స్కూలు బస్సులకు విధిగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందవలెనని పెద్దాపురం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పద్మాకరరావు తెలిపారు. బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ తన కార్యాలయం పరిధిలో గల 5 మండలాల నుండి వచ్చిన 67 స్కూలు బస్సులకు బుధవారం ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వడం జరిగి నదని, దీనిలో 11 బస్సులకు ఫిట్‌నెస్ లేని కారణంగా అనుమతి నిరాకరించి సిఎఫ్ ఆర్ఆర్ ఫారాలు ఇవ్వడం జరిగినదని, వెంటనే వారి వాహనాలను రిపేరు చేసి తన కార్యాలయానికి తీసుకుని రావలసి నదని తెలియజేసినట్లు తెలిపారు.

5 మండలాల పరిధిలో మిగిలిన 24 స్కూలు బస్సులకు వెంటనే ఎఫ్ఇ సర్టిఫికెట్ పొందాలని, ఎఫ్ఇ సర్టిఫికెట్ లేకుండా వాహనాలలో స్కూల్ పిల్లలను తీసుకుని వెళ్ళిన ఎడల, ఆ వాహనంపై కఠిన చర్యలు తీసుకోబడునని తెలిపారు. ప్రతి బస్సులో అత్యవసర, తలుపు ఫైర్ సర్వీసు పరికరాల, ప్రాథమిక చికిత్స, రహదారి మ్యాప్, డ్రైవర్ హెల్త్‌కార్డు మరియు డ్రైవర్ పూర్తి వివరాలు విధిగా వుండాలని తెలిపారు. ప్రతి స్కూలు బస్సులో వేగం వివరాలు పనిచేయాలని, లేని ఎడల ఆ వాహనములను కార్యాలయము నందు సీజ్ చేయబడునని పెద్దాపురం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పద్మాకర్ తెలిపారు.

## కైలాస భూమిలో అక్రమాలకు అడ్డుకట్ట వేయలేరా...

**- ఎన్ని ఫిర్యాదులు చేసిన అధికారులు బేఖాతరు ...**
**- ప్రతి పనికి డబ్బే ముఖ్యమా..... - వీరి ఆగడాలకు అంతులేదా.....**



ములగాడ: పారిశ్రామిక ప్రాంతంలో 5 వార్డుల్లో ప్రజలకు అందుబాటులో ఉండే కైలాస భూమిలో ఎటువంటి మౌలిక సదుపాయాలు లేక చాలా మంది ప్రజలు ఇబ్బంది పడుతున్నారు ఈప్రాంత ప్రజలు జీవీఎంసీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో ఇదే ఆసరాగా తీసుకుని ఎక్కడ గుత్తేదార్లు అక్రమ వసూళ్లకు పాల్పడుతూ తన హవాను కొనసాగిస్తున్నారు ఆది నుంచి ఈ ఒకే గుత్తేదారుడు కొనసాగిం చడంతో స్థానికంగా బలం చూపిస్తూ తనకు ఇష్టమైన రేట్లు నిర్ణయించి ప్రజల ఆగ్రహానికి గురి అయ్యే విధంగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు దీంతో ఈ ప్రాంత వాసులు ఏమీ చేయలేని పరిస్థితిలో వారు ఎంత అడిగితే అంత ఇచ్చి కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేయాలంటే ప్రభుత్వ అధికారులు ఈ స్మశాన వాటికలో ధరల పట్టికనుఅమర్చి అక్రమాలకు అడ్డు కట్ట వేస్తే ఈ ప్రాంత వాసులకు కొంత ఊరట కలుగుతుంది ఇదేవిధంగా స్మశాన వాటికలో మౌలిక సదుపాయాలులో భాగంగా నీటి సరఫరా అదే విధంగా విద్యుత్ సరఫరా కైలాస భూమిలో ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్తను తొలగించి ఇటువంటి సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

## సీతారాంకు శుభాకాంక్షలు వెల్లువ



అనకాపల్లి : ఎస్ఆర్‌బి కెమికల్ అధినేత జై అనకాపల్లిసేన వ్యవస్థాపకులు కొణతాల సీతారాం జన్మదినవేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. నాగులాపల్లి రోడ్‌లో గల సీతారాం నివాసం వద్ద, అభిమానుల కోలాహలం మద్య జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్బంగా సీతారాం అభిమానుల మద్య కేక్ కట్ చేసి అందరికి పంపిణీ చేశారు. నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున అభిమానులు విచ్చేసి, పుష్పగుచ్చం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. అభిమానుల రాకతో ఆయన నివాస గృహం కిటకిట లాడింది. శుభాకాంక్షలు తెలిపిన వారిలో నాగులాపల్లి మాజీ సర్పంచ్ యల్లపు భాస్కర్, ఉత్తాడ రామరాజు, దాడి బుజ్జి, వేగి దివాకర్, షేక్ ఉమర్, పాము పైడిరాజు, సురభి హరీష్, గల్లా వినోద్, మారిశెట్టి శ్రీనివాసరావు, డాన్ శ్రీను, కాండ్రేగుల కిరణ్, కోరుకొండ జగదీష్, కోరుకొండ సురేష్, రాజేష్, వినిత్ తదితరులు ఉన్నారు. ఇదిలా ఉండగా ముందుగా ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబిక అమ్మవారిని సీతారాం దర్శించుకున్నారు.

ఆలయానికి విచ్చేసిన వీరికి పురోహితులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుండి బయలు దేరిన సీతారాం గవరపాలెం, కుంచావారి వీధి, చిననాల్గురోడ్ల జంక్షన్, వేల్పుల వీధి, గాంధీనగరం, ఎఎంసీ కోలనీ, లక్ష్మీదేవిపేట, కశింకోట, బయ్యవరం, తాళ్లపాలెం, తదితర ప్రాంతాలలో అభిమానులు ఏర్పాటు చేసిన, పుట్టిన రోజు వేడుకలకు హాజరై కేక్ కట్‌చేసి, అందరికీ పంపిణీ చేసారు. స్థానికులు సీతారాంని ఘనంగా సత్కరించారు.



CHANGE OF NAME
I, REVU LAKSHMI DURGA
(Old name)
W/o. Revu Srinu
Residing at
1-33,
Ramalayam Peta,
Yedurulanka,
I.Polavaram Mandal,
East Godavari
do hereby declared that
changed my old name
REVU LAKSHMI DURGA
to new name
REVU DURGA
I request all to consider
my name
REVU DURGA

CHANGE OF NAME
I, DEEPIKA CHAVALI
(Old name)
W/o. Rama Krishna Chavali
Residing at
F.No.102,
Vamana Block,
Yaduvamsi Ayatanam Apts,
Pulaganipalem Road,
Pendurthi,
Visakhapatnam Dist.
do hereby declared that
changed my old name
DEEPIKA CHAVALI
to new name
VENKATA SATYA SURYA SUBBA
LAKSHMI DEEPIKA KALA
I request all to consider
my name
VENKATA SATYA SURYA SUBBA
LAKSHMI DEEPIKA KALA

In the Hon'ble Court of III Additional Junior Civil Judge, Visakhapatnam.
O.S.396/2018
Between:
Sanapala Vinodu Kumar ...Plaintiff
And:
G.Srinivas ...Defendant
To
G.SRINIVAS
Asst.Manager ICICI Bank, Housing loan section,
Ramnagar Branch, Visakhapatnam.
R/o Door No.1-99-20, Sector-V,
M.V.P.Colony, Visakhapatnam-17.
SUIT SUMMON
యీ దావాలో పరిహారం రూ.59,530/-మరియు వడ్డీ కోర్టు ఖర్చులు నిమిత్తము మీ మీద వాది పై కోర్టులో చేసియుండుట వలన స్వతహాగాని, ప్లీడరు ద్వారా గాని సదరు దావాకు ప్రత్యుత్తరము చెప్పగలందులకు **తే:05-07-2019ది ఉదయం 10.30 గంటలకు** యీ కోర్టులో హాజరై మీ సమాధానము చేసుకోవలెను. లేనియెడల మీ పరోక్షములో వాజ్యములను విమర్శి చేసి తీర్మానించుటమగునని మీరు తెలుసుకోవలసినది.
(AS PER COURT ORDER)
S.K.S.K.SARMA
R.SRINIVAS
Advocates for plaintiff
విశాఖపట్నం,
తే:19-06-2019

## 47 వార్డు సమస్యలపై అధికారులతో చర్చిస్తున్న వైఎస్ఆర్ సీపీ నాయకులు



ములగాడ: జీవీఎంసీ 47 వాడు పరిధిలోగల కొండ ప్రాంతాల్లో ప్రజల యొక్క సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వారి సమస్యలను 47 వార్డు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వార్డు అధ్యక్షులు పుర్రి సురేష్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి వివిధ విభాగాల అధికారుల వద్దకు వెళ్లి వారి సమస్యలను వారికి వివరించారు అధికారులు కూడా సానుకూలంగా స్పందించి ఎటువంటి సమస్యలు మా దృష్టికి తీసుకుని వస్తే ఆసమస్యకు తక్షణమే పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు ఇందులో భాగంగా ములగాడ తాసిల్దార్ కార్యాలయం నందు తాసిల్దార్ కలిసి వార్డు అధ్యక్షులు చేతుల మీదుగా పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు అనంతరం తాసిల్దార్ తో మాట్లాడుతూ కొండవాలు ప్రాంతాల్లో చోటా మోటా నాయకులు అండతో భూ కబ్జాలు అవుతున్నాయని అదేవిధంగా విద్యార్థులకు కుల నివాస ధ్రువీకరణ పత్రాలు విషయంలో వేగవంతం చేసి విద్యార్థుల భవిష్యత్తు కాపాడాలని ఆయన అన్నారు తాసిల్దార్ వెంటనే స్పందించి విద్యార్థులు పత్రాల్లో ఎక్కువ సమయం కేటాయించి వారికి పత్రాలు అందజేస్తున్నామని అలాగే కొండ వారి ప్రాంతాల అక్రమాలకు పాల్పడే వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని అదేవిధంగా ఖాళీ స్థలాల ఎక్కడ ఉన్న ఇప్పటివరకు అన్ని ప్రదేశాల్లో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు వేశామని ఇంకా ఎక్కడైనా ప్రభుత్వ స్థలం ఉంటే వాటి పైన దృష్టి సాధిస్తామని ఆమె అన్నారు ఈ కార్యక్రమంలో వైయస్ఆర్ సీపీ నాయకులు ధర్మాల అప్పారావు పెంటారావు సూర్యనారాయణ అనిల్ వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బీసీసెల్ కార్యదర్శి ఉద్దా భాస్కరరావు సంపత్ కృష్ణ వెంకటేశ్వర్లు ఉరుకుటి శారద సుందర రావు మడకా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## బాలబాలికలకు నాణ్యమైన విద్య అందించేందుకు అంకిత భావంతో కృషి చేయాలి : డి.మురళీధరరెడ్డి



కాకినాడ : ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలను కోరారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ కోర్టు హాలులో జిల్లా కలెక్టర్ మురళీధరరెడ్డి జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి జిల్లాలో విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు చేపడుతున్న కార్యక్రమాలకు సహాయ సహకారాలను అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాబివృద్ధి దిశ, గతిని నిర్దేశించే విద్య, ఆరోగ్యం అంశాలే తన ప్రాధన్యతలని, జిల్లాలో ఈ అంశాలలో గుణాత్మకమైన మార్పు సాధనకు ప్రత్యేక చర్యలు చేపట్టబోతున్నామని తెలిపారు. ఈ దిశగా చేపట్టే కొన్ని నిర్ణయాలు ఉపాధ్యాయులకు కొంచం కష్టం అనిపించినా, వాటి మౌళిక లక్ష్యాన్ని విశాల దృక్పధంతో అర్థం చేసుకుని వాటిని చిత్తశుద్ధి, అంకిత భావాలతో అమలు చేయాలని కోరారు. ఈ మేరకు ఉపాధ్యాయులలో స్ఫూర్తిని నింపే బాధ్యతను ఉపాధ్యాయ సంఘాలు చేపట్టాలని కోరారు. నియామక పరీక్షలలో అందరిలో మిన్నగా నిలిచివారే ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా ఎంపికౌతున్నారని, ఆదే పోటీ తత్వాన్ని తమ పాఠశాలలను ప్రయివేట్ పాఠశాల కంటే మిన్నగా నిలపడంలో కొనసాగించాలని కోరారు. ముఖ్యంగా ఓసి, ధనిక వర్గాల తల్లిదండ్రులలో ప్రభుత్వ పాఠశాల పట్ల చిన్నచూపును, అపనమ్మకాన్ని తమ పనితీరుతో తొలగించాలన్నారు. వృత్తి పరమైన సిన్సియారిటీయే విద్యార్థులలో ఉపాధ్యాయుల పట్ల గౌరవ, ఆరాధనా భావనలు పెంచుతుందని, పనివేళల్లో ఉపాధ్యాయులు పాఠశాలలో అందుబాటులో ఉండటం తప్పని సరని తెలిపారు. అన్ని పాఠశాలల్లో ఈ హాజర్ పరికరాలు పనిచేసేలా చూడాలని డిఈఓను కోరుతూ, ఉద్ధేశ్య పూర్వకంగా వాటిని పనిచేయకుండా చెడగొట్టిన వారి నుండి దాని సొమ్ము రికవరి చేయాలని ఆదేశించారు. ఉత్తీర్ణశాతం కన్నా విద్యార్థులను నాణ్యమైన నైపుణ్యాలు, విలువలు కలిగిన మానవ వనరులుగా తీర్చిదిద్దడం ముఖ్యమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్ మెంట్ పై ప్రత్యేక దృష్టి సారించాలని, కేవలం ఒకరో ఇద్దరో చురుకైన విద్యార్థుల మీదే కేంద్రీకరించకుండా, తరగతిలోని ప్రతి విద్యార్థి సమవికాశం కొరకు కృషిచేయాలని సూచించారు. అలాగే

విద్యార్థుల పౌష్టికత లక్ష్యంగా అమలు చేస్తున్న మద్యాహ్న భోజన పథకం విద్యార్థులు అందరూ సద్వినియోగం చేసుకునేట్లు చూడాలని కోరారు.విద్యార్థులలో నాయత్వ పటిమను, స్వయం చాలకతను ప్రోత్సహించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉన్నత శిఖరాలను అందుకున్న పూర్వ విద్యార్థులను పాఠశాలలకు ఆహ్వానించి వారి ద్వారా మోటివేషన్ కల్పించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశ పెట్ట నున్న నో బ్యాగ్ డే కార్యక్రమాలను అత్యంత ప్రభావవంతంగా అమలు చేసి విద్యార్థులలో నవ ఉత్తేజాన్ని నింపాలని కోరారు. చదువుతో పాటు శారీరక ఆరోగ్యం పెంపోందించే ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రతి విద్యార్థికి అందించాలన్నారు. డిజిటల్, వర్చువల తరగతి గదులను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా విద్యార్థులలో చుదువు పట్ల మరింత ఉత్సుకతను, ఆశక్తిని పెంచాలన్నారు. తన సూచనలను సకారాత్మ దృష్టితో చాలెంజ్ గా తీసుకుని ప్రభుత్వ పాఠశాలల ఘనతను, గౌరవాన్ని ఇనుమడింపచేసందుకు నిబద్ధతతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఉపాధ్యాయులను కొరారు. ఈ కార్యక్రమంలో డిఈఓ ఎస్.అబ్రహం, ఎస్ఎస్ఎ ప్రోజెక్ట్ అధికారి విజయభాస్కర్, వి జిలా కలెక్టర్ సూచనల పటిష్ఠ అమలుకు కృషి చేస్తామని తెలియజేశారు.

## నిధులు నీల పాలు

# ప్రాణాలతో చెలగాటమా?



యు కొత్తపల్లి: ఈ నిర్మాణం జరిగేది కనిపించని మారుమూల ప్రదేశంలో కాదు. ప్రతిరోజు పదుల సంఖ్యలో జిల్లా అధికారులు, వందల సంఖ్యలో ప్రజా ప్రతినిధులు, వేల సంఖ్యలో ప్రయాణికులు, సందర్శకులు తిరిగే కాకినాడ ఉప్పాడ బీచ్ రోడ్ లో ఎస్ పి జి ఎల్ వద్ద బీచ్ రోడ్డు కు అతి సమీపంలో ఉన్న పెద్ద వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో మరొక నిర్మాణం చేయవలసి న అవసరం ఉంది. ప్రజల శ్రేయస్ నిమిత్తం దాని కంటే పెద్దదో లేదా చిన్నదైనా ఏదైన వంతెన నిర్మిస్తున్నారు. దీనికి ముందు చిన్న వంతెన చాలా ప్రమాదం లో ఉంటే, అతి చక్కని పెద్ద వంతెన నిర్మించారు. ప్రమాదాలు నుండి ప్రయాణికులు బయటపడ్డారు.

ప్రస్తుతం సందర్శకులకు మంచి ప్రదేశంగా మారింది. ఇది మాత్రం కాంట్రాక్టర్లు మామూళ్ల కే మరి అర్థం లేని ఈ వంతెన నిర్మాణం ఎవరికీ అర్థం కాదు. లోతట్టులో నిర్మాణం, కడుతుండగా నే వంతెన కింద వేసిన తూరలు వెనువెంటనే ఇసుకతో మూసివేసింది. అప్పుడైనా ప్లాన్ మార్చ వలసి ఉంది. సముద్రంలో పెద్ద వంతెన కింద నుంచి వచ్చిన నీరు, అటు పొలాల నుంచి వచ్చే నీరు కొత్త వంతెన పై నుండి పోతుంది. ప్రయాణం ప్రమాదం నుండి ఎవరు వెళతారు? లక్ష్యం, ఈ ప్లాను ఎవరిది? ఎవరు ఓకే చేశారు.

ఇంత ప్రజాధనం నష్టానికి బాధ్యులపై చర్యలు తీసుకుంటూ వారి నుండి జరిగిన నష్టపరిహారం వసూలు చేసి తీరాలి. ప్రజా సమస్యల కోసమే మేమున్నామంటూ జబ్బలు చరుచుకునే వారందరూ ముందుకు రావాలి. అన్యాయానికి ఆనకట్ట కట్టాలి అంటూ కొందరు సముద్రతీర నాయకులు వాపోతున్నారు.

## భారీ రియాక్టర్ హెచ్పిసిఎల్ సంస్థలో అమరిక



ములగాడ: హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ కర్మాగారంలో నూతన ప్రాజెక్టు విస్తరణ పనుల్లో భాగంలో పనులు వేగంగా కొనసాగుతున్నాయి

దీనిలో భాగంగా కొన్ని వేల మెట్రిక్ టన్నుల రియాక్టర్లను భారీ క్రేన్ సహకారంతో ఈ రియాక్టర్లను అమర్చారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సమకూర్చిన ఈ రియాక్టర్ల అతి తక్కువ సమయంలోనే సమురును శుద్ధి చేసి అందుబాటులోకి తెచ్చే విధంగా కీలక పాత్ర వహిస్తుంది ఈ సందర్భంగా హెచ్పీసీఎల్ అధికారులు మాట్లాడుతూ గుజరాత్ నుంచి ఎల్ ఎన్ టి సంస్థ నుంచి కొనుగోలు చేసిన ఈ భారీ యంత్రాలు సముద్రమార్గం ద్వారా షిప్ యార్డ్ చేరుకుని అక్కడ నుంచి హెచ్పిసిఎల్ సంస్థకు చేరుకున్నాయని ఈ రియాక్టర్లు అమరికలో అధికారులతో పాటు కార్మికులు కూడా కష్టించి నిర్ణీత సమయానికే పూర్తి భద్రతల నడుమ విజయవంతం సాధించామని దీనికి సహకరించిన షిప్ యార్డ్ యాజమాన్యానికి జీవీఎంసీ అధికారులకు విద్యుత్ శాఖ సిబ్బందికి మల్కాపురం పోలీసు లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## 20 నుంచి 'నన్నయ' వెబ్ కౌన్సెలింగ్ రెండోదశ

రాజానగరం : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రెండో దశ వెబ్ కౌన్సెలింగ్ ఈనెల 20వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని, మొదటి దశలో సీటు పొందని అభ్యర్థులు రెండో దశకు హాజరుకావచ్చని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డా.డి.జ్యోతిర్మయి తెలిపారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ కౌన్సెలింగ్ కోసం అయిదు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం తొమ్మిది గంటల ప్రారంభమవుతుందన్నారు. 21 నుంచి 23 వరకు విద్యార్థులకు వెబ్ఆప్షన్లు అందుబాటులో ఉంటాయని చెప్పారు.

## 23వ తేదీన కనకదుర్గమ్మ వారి ఆలయంలో శిఖర ప్రతిష్ట

అన్నవరం..... తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో కొండ దిగువన తొలిపావాంచ వద్ద కొలువై యున్న శ్రీ కనకదుర్గమ్మ వారి ఆలయంలో శిఖర ప్రతిష్ట కార్యక్రమం 23వ తేదీ ఆదివారం ఉదయం 10.55 ని.లకు వేద పండితులు, అర్చక,పురోహితులతో నిర్వహించబడును.ముందుగా 22వ తేదీ ఉదయం 9 గంటలకు విఘ్నేశ్వరుని పూజ, దీక్షా వస్త్ర ధారణ, దీక్షా కంకణ ధారణ,మండపారాధన,జపములు జరుగును.23వ తేదీన కళాన్యాసము,శిఖర ప్రతిష్ట కార్యక్రమం జరుగును.కావున యావన్మంది భక్తులు, గ్రామస్థులు ఈ శిఖర ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి తీర్థ,ప్రసాదములు స్వీకరించవలసినదిగా ఈవో ఎం.వి.సురేష్ బాబు కోరారు.

## సత్యదేవుని హుండీ ఆదాయం 23రోజులకు రూ.1.17 కోట్లు



అన్నవరం........తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం తాలూకా హుండీలు లెక్కింపు బుధవారం నిర్వహించారు.గడచిన 23 రోజులుకు గాను సత్యదేవుని హుండీల ఆదాయం రూ.1,17,87,364/- (ఒక కోటి,పదిహేడు లక్షల, ఎనభై ఏడు వేల,మూడు వందల అరవై నాలుగు రూపాయలు) రాగా బంగారం 25 గ్రాములు,వెండి 950 గ్రాములు,యుఎస్ఏ కరెన్సీ 614 డాలర్లు,బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ 50 పౌండ్స్ సింగపూర్ 50 డాలర్లు మరియు ఇతర విదేశీ మారక ద్రవంతో పాటు రద్దయిన కరెన్సీ రూ.17,000/-లభ్యమయ్యాయి.

ఈ హుండీల లెక్కింపు కార్యక్రమంలో ఈవో ఎం.వి.సురేష్ బాబు, ఏసి. ఈరంకి.జగన్నాధ ా రావు, దేవస్థానం అధికారులు, సిబ్బంది, పురోహితులు,అర్చకులు, నాయీ బ్రాహ్మణులు,శ్రీహరి సేవా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులు ప్రజలతో మమేకమవ్వాలి

### ఏలూరు రేంజి డీఐజీ ఏఎస్ ఖాన్

చింతూరు : పోలీసులు ప్రజలతో మమేకం కావాలని ఏలూరు రేంజి డీఐజీ ఏఎస్ ఖాన్ సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో రాజీపడే ప్రసక్తే లేదని, మావోయిస్టులు చట్టవ్యతిరేక కార్య కలాపాలకు స్వస్తి పలకాలని పేర్కొన్నారు. ఆయన ఎస్పీ నయీమ్ అస్మి, ఓఎస్డీ అమిత్‌బర్దర్‌తో కలిసి ఎటపాక పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. విలీన మండలాల్లో శాంతి భద్రతలకు సంబంధించిన తాజా పరిస్థితులను పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ మన్యంలో ఆదివాసీ యువత ప్రలోభాలకు గురికాకుండా అవగాహన సదస్సులు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు వారి పరిస్థితులను తెలుసుకోవాలన్నారు. మావో యిస్టు ప్రభావిత ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టం చేయాలన్నారు. ఆదివాసీ యువత ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి అవకాశాల వైపు ద ృష్టి సారించాలన్నారు. మావోయిస్టుల దుశ్చర్యలను సహరించేది లేదన్నారు. వారికి ఎవరైనా సహకరించినా శిక్షార్హులవుతారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 25 ఏళ్ల కిందట భద్రాచలం డీఎస్పీగా పనిచేసినట్లు డీఐజీ చెప్పారు. అప్పట్లో నాలుగు మండలాల్లో పర్యటించినట్టు తెలిపారు. ఇక్కడి పరిస్థితులపై తనకు అవగాహన ఉందన్నారు. ఓఎస్డీ అమిత్ బర్దర్ మాట్లాడుతూ చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లోని ఆదివాసీ గ్రామాల్లో ప్రజలతో స్నేహపూర్వక సంబంధాలు నెలకొల్పేలా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డీఐజీకి వివరించారు.

## అనంతగిరి మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం



అనంతగిరి : మండలము లోని కాశీపట్నం పంచాయతీ బంగారమ్మ పేట గ్రామం వద్ద శృంగవరపుకోట నుంచి 12 మంది ప్రయాణీకులతో ఎగువ శోభ పంచాయతీ చెందిన పొన్ను పాదురు గ్రామానికి చెందిన మరియు జాకేరు వలస గ్రామానికి చెందిన12మంది ప్రయాణికులు వస్తుండగా బంగారమ్మ పేట దగ్గరకు వచ్చేటప్పటికి అనంతగిరి నుంచి మెంటాడ మండలమునకు చెందిన అడ్డతీగల గ్రామానికి చెందిన ద్విచక్ర వాహనముపై మద్యం సేవించి పాంగి పోలి రాజు 25, బోడేసు,22, సంవత్సరాలు, మద్యం మత్తులో ఆటోను ఢీ కొట్టడం జరిగింది ద్విచక్ర వాహనంపై వస్తున్న వారికి కి ఇరువురికి కాల్లువిరిగాయి. ఆటోలో ప్రయాణిస్తున్న పండోయి రుక్మిణి ఈమెకు కూడా కాళ్ళు విరిగాయి, ప్రయాణికుడు పాంగి దాసకు శరీరమంతా కవుకు దెబ్బలు తగిలాయి , ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఐ బ్యాంక్ వార్షికోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆర్డీఓ



అమలాపురం: శ్రీ యర్రా బలరామమూర్తి కోనసీమ ఐ బ్యాంక్ 9వవార్షికోత్సవం సందర్భం గా బుధవారం అమలాపురం ఆర్డీఓ కార్యాల యంలో ఆర్డీఓ బి వెంకటరమణ, ఐ బ్యాంక్ మెడికల్ డైరెక్టర్ డా.అయ్యగారి వెంకటేశ్వర రావులు ఐ బ్యాంక్ 9వ వార్షికోత్సవ ప్రచార పోస్టర్‌ను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ వెంకట రమణ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో 1500లకు పైగా కార్నియాలు సేకరించి ఈ సంస్థ వందల మందికి నూతనంగా కంటిచూపు ప్రసాదించడం ఆనందనీయ మన్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 22న విజయవంతంగా జరగాలని ఆయన ఆకాంక్షించి మరింత మందికి సేవ చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఐ బ్యాంక్ ఛైర్మన్, లయన్ డా.యర్రా నాగబాబు, టెక్నీషియన్ కె స్వర్ణలత, ఎఆర్ఐ రాంబాబు, రాకుర్తి ప్రసాద్, లయన్ సభ్యులు కూచిమంచి రాంబాబు, పేరి లక్ష్మీనరసింహం, యర్రమిల్లి విశ్వేశ్వరరావు, గోకరకొండ బాల తదితరులు పాల్గొన్నారు.

## నేడు శ్రీ మావుళ్ళ అమ్మవారి జాతర

అమలాపురం: అమలాపురం రూరల్ మండలం ఇందుపల్లి గురువులో వేంచేసియున్న శ్రీ మావుళ్ళ అమ్మవారి జాతరను గురువారం సాయంత్రం నిర్వహించనున్నారు.

జాతర సందర్భంగా గరగనృత్యాలు, కోయిడాన్సులు, డప్పువాయిద్యాలు, బాణా సంచాలతో అమ్మ వారిని గ్రామ గ్రామాన ఊరేగిస్తారు. అనంతరం శుక్రవారం అమ్మవారి తీర్థం జరుగుతుంది. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు, పిల్లలు కుటుంబ సమేతంగా శ్రీ మావుళ్ల అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించు కుంటారు.

ఈ జాతీర, తీర్థ మహోత్సవాలలో భక్తులందరూ పాల్గొని విజయంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

## పారిశ్రామిక ప్రాంతంలో జోనల్ కమిషనర్ ఆకస్మిక పర్యటన



ములగాడ: జీవీఎంసీ జోనల్ కమిషనర్ రమణ మూర్తి బుధవారం ఉదయం 48.49 వార్డులో ఆకస్మిక పర్యటన చేశారు ఈ పర్యటనలో భాగంగా పారిశుద్ధ పనులపై పర్యవేక్షించి సిబ్బంది తీరుపై మండిపడ్డారు ఎప్పటికప్పుడు పూడికలతో పాటు తడి పొడి చెత్తను వెంటవెంటనే తీసివేయాలని ప్రజలకు ఎటువంటి సమస్యలు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు అనంతరం రోడ్లపై నిర్వహిస్తున్న వ్యాపారస్తులకు రోడ్లపై వ్యాపారం చేస్తే శిక్ష తప్పదని అదేవిధంగా 49వ పరిధిలోగల ప్రకాష్ నగర్ వెల్లేదారిలో లారీ యజమాని రోడ్డుపై లారీలను నిలుపుదల చేసినందుకు పదివేల రూపాయలు జరిమానా విధిస్తూ ప్రజలకు మరియు పారిశుద్ధ సిబ్బందికిఅసౌకర్యం కల్పిస్తే ఊరు కునేది లేదని గట్టిగా హెచ్చరించారు అనంతరం కొండ వారి ప్రాంతాల్లో పారిశుద్ధ పనులను పర్యవేక్షించారుఈ పర్యటనలో జోనల్ కమిషనర్ తోపాటు ఏ ఈ ఫణి కుమార్ వార్డ్ శానిటరీ ఇన్స్పెక్టర్లు శ్రీనివాసరావు మరియు పారి శుద్ధ సిబ్బంది పాల్గొన్నారు

# నాడు నేడు నా ఎజెండా ప్రజా సంక్షేమమే

*- కొత్త ప్రభుత్వం విధానాలు గమనిస్తున్నాం - అవసరమైతే ఎంతటి పోరాటానికైనా సిద్ధం*

*- పవన్ కళ్యాణ్ అంటే ఎప్పటికీ అభిమానం - పుట్టిన రోజు సభలో సీతారాం*




అనకాపల్లి .... నాడైనా నేడైనా తన ప్రధాన ఎజెండా ప్రజా సంక్షేమమేనని జై అనకాపల్లి సేన వ్యవస్థాపకుడు కొణతాల సీతారాం అన్నారు. అనకాపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ఆయన అభిమానులు బుధవారం అతని పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగానే పట్టణంలోని వేల్పులవీధిలో జరిగిన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న అనేక సమస్యలపై గతంలో ఎన్నో పోరాటాలు చేసి ప్రజలకు అండగా నిలిచామన్నారు. ఇకపై కూడా అవసరమైన ప్రతి సందర్భంలో ఎంతటి పోరాటం చేయడానికైనా సిద్ధంగా ఉన్నామని చెప్పారు. తనకు రాజకీయ భిక్ష పెట్టింది జనసేన అని, తన రాజకీయ గురువు పవన్ కళ్యాణ్ అని స్పష్టం చేసారు. ఓట్ల కోసం నోట్లు కోసం రాజకీయాల్లోకి రాలేదన్నారు. ప్రజా సంక్షేమంలో భాగస్వామ్యం కావాలని మాత్రమే ప్రజా జీవితంలోకి వచ్చినట్లు తెలిపారు. గడిచిన ఎన్నికల్లో డబ్బు, మద్యం అధిక ప్రభావం చూపడంతో పాటు ఈవీఎంలలో అవకతవకలు నెలకొన్నట్టు కూడా తమ ద ృష్టికి వచ్చిందన్నారు. కొత్త ప్రభుత్వం విధివిధానాలు పరిశీలిస్తున్నామని, రెండు మూడు నెలల్లో తమ కార్యాచరణ మొదలవుతుందని చెప్పారు. పవన్ కళ్యాణ్ కబురంపితే తిరిగి జనసేన పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని, పార్టీ తరపున గతంలో మాదిరిగా ఉద్యమాలు చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కొద్ది రోజుల్లోనే ప్రజలకు వివరణ ఇవ్వాల్సిన పరిస్థితిలో ప్రభుత్వం, ప్రభుత్వాన్ని నిలదీసే స్థితిలో తాము ఉంటామన్నారు. ఏది ఏమైనా ప్రజా సంక్షేమం కోసం ఉద్యమ ధోరణికి కట్టుబడి ఉన్నామని,జనసేన తరపున గానీ, జై అనకాపల్లి సేన తరపున గానీ నిరంతరం ప్రజలకు అండగా ఉంటామని ఈ సందర్భంగా సీతారాం హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మద్దాల కూర్మారావు, గరికి వెంకటరావు, నల్లల దేముళ్లు, వాకాడ చిన్నారి, వాకాడ ప్రసాద్, వాకాడ సతీష్, పెదిరెడ్ల రమేష్, వాకాడ బాబు, దండా బాబీ, కోరుకొండ జగదీష్, కోరుకొండ సురేష్, సురభి హరీష్, దాడి బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ పాఠశాలల్లో ప్రవేశానికి 260 మంది అర్హత : సాంఘిక సంక్షేమశాఖ డీడీ శోభారాణి

కాకినాడ : సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో షెడ్యూల్డు కులాలకు చెందిన విద్యార్థులకు 'బెస్ట్ అవైలబుల్ స్కూల్స్' పథకం కింద కార్పొరేట్ పాఠశాలల్లో అయిదో తరగతిలో ప్రవేశానికి 260 మంది అర్హత సాధించారని ఆ శాఖ ఉప సంచాలకురాలు ఎం.ఎం.శోభారాణి తెలిపారు. స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఎంపికైన విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో ప్రవేశ పత్రాలను అందజేశారు. జిల్లాలో 350 మంది విద్యార్థులకు అవకాశం ఉన్నప్పటికీ ఈ నెల 7న నిర్వహించిన ప్రవేశ పరీక్షలో 260 మంది విద్యార్థులు అర్హత సాధించారని తెలిపారు. ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు 210 మంది హాజరయ్యారన్నారు. మిగిలిన విద్యార్థులు కాకినాడలోని తమ కార్యా లయానికి వచ్చి ప్రవేశ పత్రాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి జేవీ రమణ, వసతి గృహాధికారులు పాల్గొన్నారు.

## మడ అడవులకు ప్రపంచ ఖ్యాతి

రాజమహేంద్రవరం : : జిల్లాలో మడ అడవు లకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు లభించనుంది. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ప్రపంచ వారసత్వ సంపదగా మడ అడవులను తీర్చిదిద్దేందుకు కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. తాళ్లరేవు మండలంలోని కోరంగి, ఐ.పోలవరం మండలంలోని భైరవ-పాలెంలో 23,570 హెక్టార్లలో మడ అడవులు విస్తరించి ఉన్నాయి.

వీటిని మరింత ప్రాచుర్యంలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక కమిటీని నియమించింది.

## విద్యార్థుల భవిష్యత్తే ముఖ్యం : ఎమ్మెల్యే కన్నబాబు రాజు



యలమంచిలి : యలమంచిలి స్టేషన్ రోడ్డు హైస్కూల్‌లో విద్యార్థిని, విద్యార్థులకు బుధవారం ఎమ్మెల్యే యు.వి. రమణ మూర్తిరాజు (కన్నబాబు) చేతుల మీదగా విద్యార్థులకు దుస్తులు పాఠ్య పుస్తకాలు, బూట్లు విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు 100 శాతం పాస్ అవ్వాలని ఆయన చెప్పారు. ఈ బాధ్యత ఉపాధ్యాయులందరికీ ఉందని ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి భోధన అందించకపోతే చర్యలు తప్పవన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమ్మఒడి పథకం ద్వారా విద్యార్థులు తల్లిదండ్రుల ఖాతాలోకి జనవరి 26న నగదు ప్రభుత్వం జమ చేస్తుందని తెలిపారు. జగన్మో హన్‌రెడ్డి ఆశయాలను విద్యార్థులు తల్లిదండ్రులు అవగాహనతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పంపించాలని ప్రైవేటు పాఠశాలకు విద్యార్థిని పంపించొద్దు ఆయన చెప్పారు. సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో విద్యార్థుల చదువుల కోసం ఎంత ఖర్చైనా ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు పాఠశాలకు లేట్‌గా వచ్చిన చదువు విషయంలో విద్యార్థులకు నోట పాటలు జరిగిన నేరుగా విద్యార్థిలు భయపడకుండా ఆయనతో ఫోన్లో మాట్లాడితే సమస్య వెంటనే పరిష్కరిస్తామని విద్యార్థులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీ.ఇ.ఓ రమణరాజు, ఎమ్.ఇ.ఓ ఎమ్.ఎస్.ఎన్ మూర్తి, మాజీ ఎంపీపీ బొద్దపు ఎర్రయ్యదొర, బొద్దపు గోవిందు, బొద్దపు లక్ష్మి, రావీ సతీష్, పడాల శ్రీను, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# లంచగొండి అధికారులు ఔట్!

## -మరో 15 మంది అవినీతి ఆఫీసర్లపై వేటు
## -ఉద్యోగాల్లోంచి తొలగిస్తూ కేంద్ర ఆర్థిక శాఖ ఆదేశాలు

న్యూఢిల్లీ: అవినీతి అధికారులపై కేంద్ర ప్రభుత్వం కొరఢా ఝుళిపిస్తున్నది. ఇప్పటికే అవినీతి ఆరోపణలున్న ఆదాయం పన్ను (ఐటీ) శాఖ అధికారులపై వేటు వేసిన మోదీ సర్కారు.. మంగళవారం అవినీతి, లంచం అభియోగాలపై 15 మంది సీనియర్ కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్ అధికారులనూ ఉద్యోగాల్లోంచి తొలగించింది. ఇందులో ఓ ప్రిన్సిపల్ కమిషనర్ స్థాయి అధికారి కూడా ఉండటం గమనార్హం. ప్రాథమిక నియమాల్లోని 56(జే) నిబంధన కింద ఈ పరోక్ష పన్నులు, కస్టమ్స్ కేంద్ర బోర్డు (సీబీఐసీ) అధికారులపై కేంద్రం చర్యలకు దిగింది. ఉద్యోగాలు కోల్పోయిన వారిలో ప్రిన్సిపల్ కమిషనర్ నుంచి అసిస్టెంట్ కమిషనర్ స్థాయి వరకు అధికారులున్నారు. వీరిలో కొందరు ఇప్పటికే సస్పెన్షన్‌లో ఉన్నారు అని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఆదేశం చెబుతున్నది. వీరిపై సీబీఐ అవినీతి కేసుల్ని నమోదు చేయడమో లేదా లంచం, అక్రమార్జన, ఆదాయానికి మించి ఆస్తులున్న కేసులో నమోదై ఉన్నాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. డిస్మిస్ అయిన వారిలో ఢిల్లీలోని సీబీఐసీలో ప్రిన్సిపల్ అదనపు డైరెక్టర్ జనరల్ (ఆడిట్)గా పనిచేస్తున్న ప్రిన్సిపల్ కమిషనర్ అనుప్ కుమార్ శ్రీవాత్సవ, జాయింట్ కమిషనర్ నళిన్ కుమార్ కూడా ఉన్నారు. 1996, 2012ల్లో శ్రీవాత్సవపై సీబీఐ కేసులు నమోదైయ్యాయని, ఇప్పటికే సస్పెండైన నళిన్ కుమార్‌పైనా సీబీఐ కేసులున్నాయని ఆర్థిక శాఖ వివరించింది. గత వారం పన్నెండు మంది ఐటీ అధికారులనూ అవినీతి, మోసం, విధి నిర్వహణలో తప్పుల ఆరోపణలపై కేంద్రం డిస్మిస్ చేసిన విషయం తెలిసిందే. మరో నలుగురి హొదాలను తగ్గించింది. జాయింట్ కమిషనర్ స్థాయిల నుంచి డిప్యూటీ కమిషనర్లుగా డిమోట్ చేసింది.

**రూల్ 56(జే) ప్రయోగం**

ప్రజా శ్రేయస్సు కోసం ఏ ప్రభుత్వ అధికారినైనా తొలగించే హక్కును కేంద్రానికి ప్రాథమిక నియమాల్లోని 56(జే) నిబంధన అందిస్తున్నది. చాలా ఏండ్లుగా అవినీతి ఆరోపణల్ని ఎదుర్కొంటున్న అధికారులపై ఈ రూల్‌నే ఇప్పుడు మోదీ సర్కారు ప్రయోగించింది. మూడు నెలల ముందస్తు నోటీసు ఇచ్చి చర్యలకు దిగే కేంద్రం.. 56తో తమకు లభిస్తున్న అధికారాల ద్వారా ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ అధికారుల్లో 50 ఏండ్లు పూర్తయిన వారిని పదవీ విరమణ చేయించగలదు. ఈ క్రమంలోనే ఈ 15 మంది ఐఆర్ఎస్ అధికారులను రిటైర్ కావాలని ఆదేశించినట్లు రెవిన్యూ శాఖ ఓ ప్రకటనలో స్పష్టం చేసింది.




**వైజాగ్ జీఎస్టీ జోన్ ఏసీ కూడా..**

రిటైర్ కావాల్సిందేనంటూ కేంద్ర ప్రభుత్వం ద్వారా నోటీసులను అందుకున్న వారిలో వైజాగ్ జీఎస్టీ జోన్ అసిస్టెంట్ కమిషనర్ రాజు శేఖర్ కూడా ఉన్నారు. కోల్‌కతా కమిషనర్ సన్సర్ చంద్, చెన్నై కమిషనర్ జీ శ్రీ హర్షలతోపాటు కమిషనర్ స్థాయి అధికారులు అతుల్ దీక్షిత్, వినయ్ బ్రిజ్ సింగ్, ఢిల్లీ జీఎస్టీ జోన్ డిప్యూటీ కమిషనర్ అమ్రేశ్ జైన్‌లు కూడా ఉన్నారు. కోల్‌కతా అదనపు కమిషనర్ అశోక్ మహిదా, మరో అదనపు కమిషనర్ వీరేంద్ర అగర్వాల్, అసిస్టెంట్ కమిషనర్లు ఎస్-ఎస్ పబన, ఎస్ఎస్ బిష్త్ (భువనేశ్వర్ జీఎస్టీ జోన్), వినోద్ సంగ (ముంబై జీఎస్టీ జోన్), మహ్మద్ ఆల్తాఫ్ (అలహాబాద్), డిప్యూటీ కమిషనర్ అశోక్ అస్వాల్ (ఢిల్లీ) ఉన్నారు.

**వ్యక్తిగత పగతోనే: శ్రీవాత్సవ**

ఉద్యోగాన్ని కోల్పోయిన సీనియర్ రెవిన్యూ అధికారి అనుప్ కుమార్ శ్రీవాత్సవ.. తనపై ఈ చర్యలకు కారణం రెవిన్యూ కార్యదర్శి అజయ్ భూషణ్ పాండేనే అని ఆరోపించారు. ఆయనకు నాకూ వ్యక్తిగత వైరం ఉందని, ఈ క్రమంలోనే ఈ చర్యలకు పాల్పడ్డారన్నారు. శ్రీవాత్సవ 1984 బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారి. ఐఆర్ఎస్ (కస్టమ్స్, కేంద్ర ఎక్సైజ్) అధికారుల సంఘం అధిపతిగా కూడా ఉన్నారు. చీఫ్ కమిషనర్‌గా పదోన్నతి కోసం నా ఫైల్‌ను రెవిన్యూ శాఖ నుంచి యూపీఎస్‌సీకి పంపారు. క్షుణ్ణంగా పరిశీలించి డీపీసీ సమీక్ష కోసం గతేడాది డిసెంబర్ 20ని ఖరారు చేశారు. అయితే దానికి ఒక్కరోజు ముందు పాండే నా ఫైల్‌ను వెనక్కి రప్పించారు. ఇది కేవలం వ్యక్తిగత కక్ష్య సాధింపుల చర్యే అని ఓ ప్రకటనలో శ్రీవాత్సవ తెలిపారు. అయినా తనపై వచ్చిన అవినీతి ఆరోపణలపై కోర్టులు విచారించి క్లీన్‌చిట్ ఇచ్చాయని గుర్తుచేశారు. తనపై వచ్చిన ఆరోపణలన్నీ తప్పుడు ఆరోపణలేనని స్పష్టం చేశారు. తనపై 56(జే) రూల్‌ను ప్రయోగించడం అన్యాయమన్నారు.

## ఒక్కసారి చార్జింగ్‌తో 156 కిలోమీటర్లు

### -తొలి ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్‌ను ఆవిష్కరించిన రివోల్ట్



న్యూఢిల్లీ: స్టార్టప్ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ రివోల్ట్ ఇంటెల్లికార్ప్..మంగళవారం తన తొలి విద్యుత్‌తో నడిచే మోటర్‌సైకిల్ ఆర్‌వీ400ను ఆవిష్కరించింది. వచ్చే నాలుగు నెలల్లో ఈ మోడల్‌ను ఏడు నగరాల్లో విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. కృత్రిమ మేధస్సు కలిగిన ఈ బైకును ఒక్కసారి రీచార్జి చేస్తే 156 కిలోమీటర్ల మేర ప్రయాణించనున్నదని కంపెనీ వెల్లడించింది. యువతీయువకులను లక్ష్యంగా చేసుకొని రూపొందించిన ఈ బైకుతో ఎలాంటి కాలుష్యం ఉండదని రివోల్ట్ ఇంటెల్లికార్ఫ్ ఫౌండర్ రాహుల్ శర్మ తెలిపారు. వచ్చే నెలలో ఈ బైకు ధరను ప్రకటించనున్న సంస్థ.. ఈ బైకు కావాలనుకునేవారికి ఈ నెల 25 నుంచి రూ.1,000 చెల్లించి కంపెనీ వెబ్‌సైట్ ద్వారా, లేదా అమెజాన్ ద్వారా బుకింగ్ చేసుకునే సదుపాయం కల్పించింది. త్వరలో ఢిల్లీ-ఎన్‌సీఆర్, పుణె, బెంగళూరు, హైదరాబాద్, నాగపూర్, అహ్మదాబాద్, చెన్నైలలో వచ్చే నాలుగు నెలల్లో విడుదల చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. దేశవ్యాప్తంగా చార్జింగ్ సమస్యలు అధికంగా ఉన్న నేపథ్యంలో కంపెనీ.. బోర్డు, పోర్టబుల్ చార్జింగ్ ఫీచర్స్, పోర్టబుల్ బ్యాటరీ వంటివి ఆఫర్ చేస్తున్నది. నాలుగు గంటల్లో పూర్తిస్థాయిలో రీచార్జి కానున్న ఈ బైకు బ్యాటరీ.. 150 కిలోమీటర్లకుపైగా పని చేయనున్నది. ఈ బైకులను తయారు చేయడానికి హర్యానాలోని మానెసర్ వద్ద ఏడాదికి 1.2 లక్షల యూనిట్ల సామర్థ్యంతో ప్లాంట్‌ను సంస్థ ఏర్పాటు చేసింది.

# కీర్తి సురేష్ న్యూలుక్



కాస్త బొద్దుగా, చూడముచ్చటైన రూపలావణ్యంతో అభిమానుల్ని అలరిస్తుంటుంది కీర్తి సురేష్. అయితే ప్రస్తుతం మన కథానాయికలు ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యతనిస్తూ సైజ్‌జీరో శరీరాకృతికోసం కసరత్తులు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ వరుసలో కీర్తిసురేష్ చేరింది.

ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఈ అమ్మడు పోస్ట్ చేసిన ఓ ఫొటో చూసిన అభిమానులు ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. పూర్తిగా సన్నబడి సరికొత్త రూపంతో దర్శనమిస్తున్న కీర్తిసురేష్ ఫొటోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. చాలా మంది అభిమానులు ఆమె లుక్ బాగుందని కితాబివ్వగా, మరికొందరేమో బొద్దుగా ఉంటేనే బాగుండేదని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం కీర్తిసురేష్ తెలుగు, తమిళ భాషల్లో రూపొందిస్తున్న ఓ చిత్ర షూటింగ్‌లో భాగంగా స్పెయిన్‌లో ఉంది.

అక్కడే 45 రోజుల పాటు భారీ షెడ్యూల్ చేయబోతున్నారు. నరేంద్రనాథ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మహేష్ ఎస్ కోనేరు నిర్మిస్తున్నారు. దసరా కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# పలాసలో జరిగిన కథ



రక్షిత్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం పలాస 1978. కరుణకుమార్ దర్శకుడు. ధ్యాన్ అట్లూరి నిర్మాత. నక్షత్ర కథానాయిక. హీరో రక్షిత్ జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం చిత్ర ఫస్ట్‌లుక్‌ను దర్శకుడు మారుతి, చిత్ర సమర్పకుడు తమ్మారెడ్డి భరద్వాజ విడుదల చేశారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ ఉత్తరాంధ్రలోని పలాస నేపథ్యంలో జరిగే కథ ఇది. 40ఏళ్ల కాలవ్యవధిలో కథ నడుస్తుంది. 70వ దశకంలో పలాస ప్రాంతంలోని సామాజిక అసమానతలు, కులాల మధ్య పోరును ఆవిష్కరిస్తుంది. నేటివిటీ ప్రధాన కథల్ని ఇష్టపడే ప్రేక్షకులు కొత్త అనుభూతినిచ్చే చిత్రమవుతుంది. పలాస ఆత్మను పట్టిచూపుతుంది అన్నారు. ప్రతి ప్రాంతంలో ఓ మాఫియా ఉంటుంది. ఈ సినిమాలో పలాస ప్రాంత మాఫియా ఎలా ఉంటుందో చూపించారు. తెలుగులో ఓ విభిన్న చిత్రమవుతుంది అని తమ్మారెడ్డి భరద్వాజ చెప్పారు.

ఈ సినిమాలో తాను క్రూర స్వభావి అయిన వ్యక్తి పాత్రను పోషించానని రఘు కుంచె తెలిపారు. రక్షిత్ మాట్లాడుతూ రెండు నెలల పాటు పలాసలో చిత్రీకరణ జరిపాం. నా పాత్ర నాలుగు భిన్న పార్శ్వాల్లో సాగుతుంది. హిందీలోని గ్యాంగ్స్ ఆఫ్ వస్సేపూర్ తరహాలో తెలుగు ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది అన్నారు.

# చిత్రభాను

# నటుడిగా నాకు ఇది ఛాలెంజ్!

**అర్జున్‌రెడ్డితో మా సినిమాను పోల్చిచూడొద్దు. మాతృకను కాపీ చేయకుండా కథలోని ఆత్మను నవ్య పంథాలో ఆవిష్కరిస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కించాం అని అన్నారు షాహిద్‌కపూర్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న హిందీ చిత్రం కబీర్‌సింగ్. తెలుగులో విజయవంతమైన అర్జున్‌రెడ్డి ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. సందీప్ రెడ్డి వంగా దర్శకుడు. ఈ నెల 21న ఈ చిత్రం విడుదలకానుంది. ఈ సందర్భంగా పాత్రికేయులతో షాహిద్ కపూర్ పంచుకున్న ముచ్చట్లివి..**

-నా కెరీర్‌లో ముప్పై సినిమాలు చేశాను. పదిహేనేళ్ల ప్రయాణంలో అవి తక్కువే అయినా నా దృష్టిలో అది పెద్ద సంఖ్యగానే భావిస్తున్నాను.

**అర్జున్‌రెడ్డి సినిమా చూసినప్పుడు ఏమనిపించింది?**

-అర్జున్‌రెడ్డి సినిమాకు నేను అభిమానినే. తెలుగు భాష నాకు అర్థం కాకపోయినా అందులోని పాత్రలు, భావోద్వేగాలు, నటనతో కనెక్ట్ అయ్యాను. రియలిస్టిక్‌గా కొత్తగా ఉందనిపించింది. ముఖ్యంగా విజయ్ అభినయం నన్ను అమితంగా ఆకట్టుకుంటుంది. అద్భుతంగా నటించాడు.

విజయ్ దేవరకొండతో పోలిస్తే మీరు చాలా సీనియర్ నటుడు కదా. ఈ పాత్రను అర్థం చేసుకొని నటించడంలో ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి?

-కొత్త నటులతో పోలిస్తే సీనియర్ నటుల పట్ల ప్రేక్షకుల దృక్కోణం వేరుగా ఉంటుంది. ఇదివరకు ఎన్నో విభిన్నమైన పాత్రలు చేసి ఉండటంతో కొత్త క్యారెక్టర్‌తో ప్రేక్షకుల్ని సహానుభూతి చెందేలా చేయడానికి సీనియర్ నటులు చాలా కష్టపడాల్సి ఉంటుంది. గత పాత్రల తాలూకూ ఛాయల్ని మర్చిపోయేలా చేయడం ఛాలెంజింగ్‌గా ఉంటుంది. ఈ సినిమాలో నటుడిగా నాకు అలాంటి సవాలే ఎదురైంది. షాహిద్ కపూర్ కాకుండా కబీర్‌సింగ్ జీవితాన్ని ఆవిష్కరించడం ఛాలెంజింగ్‌గా అనిపించింది.

**ఈ రీమేక్‌లో నటించాలన్నది మీ స్వీయ నిర్ణయమేనా?**

-నా ఆలోచన కాదిది. ఓ నిర్మాణ సంస్థ వారు ఈ రీమేక్‌తో నన్ను సంప్రదించారు. నచ్చింది కదా అని అంగీకరించి సినిమాను చెడగొట్టాలనుకోకుండా దర్శకుడు ఆసక్తిని అనుసరించి అంగీకరించాను. ఓ మంచి కథతో ఏ భాషా ప్రేక్షకులైనా ఆకట్టుకోవచ్చదన్నది నా అభిప్రాయం. హిందీ ప్రేక్షకులకు కబీర్‌సింగ్ కథ చెప్పే అదృష్టం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను.

**మీరు నటించిన తొలి రీమేక్ సినిమా ఇదే కదా? ఆ అనుభవం ఎలా ఉంది?**

-ఇదే నా తొలి రీమేక్ సినిమా. కొన్ని రీమేక్‌లు కథను అనుసరించి సాగితే మరికొన్ని క్యారెక్టరైజేషన్ ఆధారంగా సాగుతాయి. కబీర్‌సింగ్ రెండో కోవకు చెందిన సినిమా. ఓ వ్యక్తి భావోద్వేగాలు, ఆటిట్యూడ్ ఆధారంగా సాగుతుంది. పూర్తిగా అర్జున్‌రెడ్డిని కాపీ చేయకుండా మాతృకలోని ఆత్మను యథాతథంగా నవ్యపంథాలో ఆవిష్కరించే ప్రయత్నం చేశాం.

**ఉడ్తా పంజాబ్‌లో డ్రగ్ ఎడిక్ట్ పాత్రలో నటించారు. ఆ అనుభవం కబీర్‌సింగ్ పాత్ర చేయడానికి ఎంతవరకు ఉపయోగపడిందని అనుకుంటున్నారు?**

-ఉడ్తాపంజాబ్‌లో చేసిన టామీసింగ్ పాత్రకు కబీర్‌సింగ్‌కు ఎలాంటి పోలికలు ఉండవు. సినిమా పూర్తయ్యాకటామీసింగ్ కాకుండా కబీర్‌సింగ్ ఆలోచనలతోనే థియేటర్ నుంచి ప్రేక్షకులు బయటకు వెళ్తారు.

**విజయ్ దేవరకొండను ఎప్పుడైనా కలిశారా?**

-విజయ్‌ని కలవడం కోసం నేను ఎదురుచూస్తున్నాను. కానీ అతడు చాలా బిజీగా ఉన్నాడు(నవ్వుతూ) విజయ్‌ని కలిపిస్తానని సందీప్‌రెడ్డి చాలా సార్లు అన్నారు. కానీ కుదరలేదు. హైదరాబాద్ వచ్చాను కాబట్టి ఇప్పుడు కలవాలని అనుకుంటే విజయ్ ఇక్కడ లేడు.

**ప్రభాస్ ఈ ట్రైలర్‌ను ప్రశంసించడం ఎలా అనిపించింది?**

-నా హెయిర్‌ట్కెస్టెలిస్ట్ హకీమ్ ప్రభాస్‌కు ట్కెస్టెలిస్ట్‌గా పనిచేస్తుంటాడు. అతడి ద్వారా ప్రభాస్ ఈ సినిమా గురించి తెలుసుకొని టీజర్ తనకు నచ్చిందని తప్పకుండా చూస్తానని చెప్పడం ఆనందాన్ని కలిగించింది



**మాతృకతో ఈ సినిమాను పోల్చిచూస్తారనే భయాలు ఉన్నాయా?**

-అర్జున్‌రెడ్డితో ఈ సినిమాను పోల్చిచూడటం సరికాదు. మాతృకకు ఇవ్వాల్సిన గౌరవం ఇచ్చాం. ఈ రీమేక్ కోసం మేము చాలా శ్రమించాం. మా కష్టానికి, నటనకు గౌరవం ఇవ్వాలి. అంతేకానీ పోలికలు పెట్టడం సరికాదు. నాకైతే పోల్చిచూడటం నచ్చదు కానీ ఎంత వద్దని చెప్పిన ప్రేక్షకులు మాత్రం అదే చేస్తారు. అర్జున్‌రెడ్డి తెలుగు ప్రేక్షకుల కోసం తీసిందైతే కబీర్‌సింగ్ హిందీ ప్రేక్షకుల కోసం తీశారు.

**రొమాంటిక్ సన్నివేశాల్లో నటించే ముందు మీ భార్య అనుమతి తీసుకుంటారా?**

-కబీర్‌సింగ్ చేయమని తనే నాకు సలహా ఇచ్చింది. ఈ పాత్రకు నేనయితేనే న్యాయం చేయగలనని, నా కెరీర్‌లో ప్రత్యేకమైన సినిమాగా నిలుస్తుందని తనే చెప్పింది. నటుల కెరీర్‌లో రొమాన్స్ ఓ భాగమేనని ఆమె అర్థం చేసుకుంటుంది. ఫలానా పని చేయవొద్దని ఆమె ఎప్పుడూ ఆంక్షలు విధించదు.

# మ..మ్మా..రే కల్లు మత్తెక్కింది!

రోజాపూలు, ఒకరికిఒకరు, తరువాత తెలుగులో మళ్ళీ నాకు ఆ స్థాయి గుర్తింపును తీసుకొచ్చే చిత్రం అసలేం జరిగింది. కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు తప్పకుండా నచ్చే చిత్రమిది అన్నారు కథానాయకుడు శ్రీరామ్. తెలుగులో కొంత విరామ తర్వాత హీరో శ్రీరామ్ నటిస్తున్న చిత్రం అసలేం జరిగింది. ఈ చిత్రంలో శ్రీరామ్ సరసన కన్నడ భామ సంచితా పదుకునే నాయికగా నటిస్తోంది. ఎక్సోడస్ మీడియా పతాకంపై శ్రీమతి నీలిమ నిర్మిస్తున్న ఈ చిత్రానికి కెమెరామెన్ ఎన్‌వీఆర్ దర్శకత్వ బాధ్యతల్ని చేపట్టారు. కాగా ఈ చిత్రంలోని చిర్రావూరి విజయ్‌కుమార్ రచించిన మమ్మారే కల్లు మత్తెక్కింది. మమ్మారే కల్లు మతిపోయింది అనే పాటను ఓ ఎఫ్ఎమ్ రేడియో స్టేషన్‌లో కథానాయకుడు శ్రీరామ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ గ్రామీణ నేపథ్యంలో సాగే ఒక సస్పెన్స్ లవ్‌స్టోరీగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం అని తెలిపారు.



# విశాఖ శ్రీ శారదా పీఠం ఉత్తరాధిపతి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతికి అఖండ స్వాగతం

- స్వామి రాక సందర్భంగా భక్తజన సంద్రంగా మారిన విశాఖపట్నం
- మహానగరమంతా వెల్లివిరిసిన ఆధ్యాత్మిక సౌరభాలు
- స్వరూపానందేంద్రకు సిసలైన వారసులని స్వాత్మానందేంద్రను కొలిచిన భక్తులు





విశాఖపట్నం : ప్రతిష్టాత్మక విశాఖ శ్రీ శారదాపీఠం ఉత్తరాధిపతిగా విజయవాడలో వేదవేద్యుల.. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు జగన్మోహన రెడ్డి.. కె. చంద్ర శేఖరరావుల సమక్షంలో సోమవారంనాడు నియమితులైన స్వాత్మానందేంద్ర సరస్వతీ మహాస్వామి తొలిసారిగా విశాఖ శ్రీ శారదా పీఠానికి బుధవారం సాయంత్రం విచ్చేశారు. ఈ సందర్భంగా ఇక్కడి ఎన్.ఏ.డి కొత్తరోడ్డు జంక్షన్లో స్వామి వారికి అఖండ స్వాగతం లభించింది. స్వాత్మానందేంద్ర సరస్వతీ మహాస్వామిని చూసి తరించేందుకు భక్తజనం తండోపతండాలుగా తరలి వచ్చారు. కులమతాలకు అతీతంగా స్వాత్మానందేంద్రకు జనం హారతులు పట్టారు. ఆయనను.. వారి వాహన శ్రేణిని .. పూల జల్లుల్లో ముంచెత్తారు. జయ జయ శంకర ..హర హర శంకర.. నినాదాలతో ఆ ప్రాంతమంతా మారుమోగి పోయింది. దర్శించవచ్చిన భక్తులందరికీ స్వాత్మానందేంద్ర మంగళా శాసనాలు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు కె.కె.రాజు తదితర పెద్దలు స్వామి దీవెనలు పొందినవారిలో ఉన్నారు. ఎన్ ఏ.డీ రోడ్డు నుంచి ఒక శోభాయాత్రగా స్వామి ముందుకు సాగిపోయారు. స్వామికి వేపగుంట కూడలిలో ఘనంగా భక్త జనం జేజేలు పలికారు. పెందుర్తి శాసన సభ్యుడు అన్నంరెడ్డి అదీప్ రాజ్ దీనికి నాయకత్వం వహించారు. స్వామిపై పుష్ప వర్షం కురిపించారు. పాద నమస్కారాలు చెల్లించారు. జనం కమ్మని పండివగా ఈ కార్యక్రమాన్ని తిలకించారు. ఆ కూడలిలోనే స్వాత్మానందేంద్ర సరస్వతిని అపర సరస్వతిగా అభివర్ణిస్తూ భక్తులు హంసవాహనంలో ఆయనను ఊరేగింపుగా పీఠానికి బయలుదేరదీశారు. గోపాలపట్నం జంక్షన్ చేరకోగానే స్వామికి పూర్వ కార్పొరేటర్ బెహరా భాస్కరరావు తన అనుచరులతో కలసి విశేషమైన రీతిలో ఘన స్వాగతమిచ్చారు. హంసవాహనం మీదనే పరమహంస పరివ్రాజకాచార్యులుగా శ్రీ శ్రీ శ్రీ స్వాత్మానందేంద్ర స్వామి శారదా పీఠానికి చేరుకున్నారు. అక్కడ వారికి వేదపండితులు సభక్తికంగా స్వాగతం పలికారు.







రాజశ్యామల అమ్మవారికి అర్చన జరిపిన స్వాత్మానందేంద్ర ..పీఠాధిపతి స్వరూపానందేంద్రకు ప్రణమిల్లారు. అశేషజనవాహిని వెంటరాగా మేళతాళాలతో స్వాత్మానందేంద్రను పీఠంలోనికి తోడ్కొని వెళ్లారు.

రా ష్ట్ర పర్యాటక శాఖామంత్రి అవంతి శ్రీనివాసరావు తదితర ప్రముఖులు పీఠంలో స్వాములను దర్శించుకున్నారు. వారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమమంతా బుధవారం నాడు విశాఖపట్నాన్ని తేజోమయం చేసింది. ఆధ్యాత్మిక సౌరభాలను వెదజల్లింది.





### శ్రీశ్రీశ్రీ కుంచుమాంబ విగ్రహ విరాళదాత

## గోవిందరావుకు ఘనసన్మానం



మాధవధార : మాధవధార గ్రామ దేవత శ్రీశ్రీశ్రీ కుంచుమాంబ అమ్మవారి విగ్రహ విరాళదాతయైన మూల గోవిందరావును మాధవధార గ్రామవాస్తవ్యులు ఘనంగా సన్మానించారు. మాధవధార నివాసుల ఆధ్వర్యంలో సంఘం కార్యదర్శి సనపల పాండురంగారావు ఆధ్వర్యంలో జరిగిన ఘన సన్మాన కార్యక్రమంలో భాగంగా శ్రీ వేంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని అందజేశారు.

ఈ కార్యక్రమంలో పండగ నిర్వహణ చైర్మన్ సనపల బంగార్రాజు, శ్రీ మాధవ యువజన సమాజం సెక్రటరీ సనపల అప్పలస్వామి (బొజ్జన్న), మాధవధార రెసిడెన్షియల్ కమిటీ మెంబర్ సీపాన ప్రసాదు, ఎస్. వెంకటేసు, బాలరాజు, ఎస్. గోవిందరాజు, బి. చంటి, యువ నాయకుడు కర్రి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## జయ జయ శంకర.. హర హర శంకర..



విశాఖ సిటీః శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ స్వామి వారి అనుగ్రహంతో వారి కరకమలాల మీదుగా సన్యాస ఆశ్రమం స్వీకరించి విశాఖ శ్రీ శారదాపీఠం ఉత్తర పీఠాధిపతిగా పట్టాభిషిక్తులై తొలిసారిగా విశాఖపట్నానికి చేరుకున్న శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి వారికి ఎన్ఏడి కొత్తరోడ్డు జక్షన్ వద్ద ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు మరియు రాష్ట్ర కార్యదర్శి చొక్కాకులు వెంకటరావు కుటుంబ సభ్యులు, అంతకాపల్లి మాజీ సర్పంచ్ చొక్కాకుల గోవింద్ కుటుంబ సభ్యులు, రాష్ట్ర, పార్లమెంట్, సిటీ, నాయకులు, వార్డు అధ్యక్షులు, సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో మహాస్వామి వారి భక్తులు తదితరులు పాల్గొన్నారు.




## ప్రపంచకప్ నుంచి శిఖర్ ధావన్ ఔట్



న్యూఢిల్లీ: ప్రపంచకప్‌లో వరుస విజయాలతో జైత్రయాత్ర సాగిస్తున్న టీమిండియాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఎడమచేతి బొటనవేలుకు గాయం కారణంగా ఓపెనర్ శిఖర్ ధావన్ ప్రపంచకప్ టోర్నీకి దూరమయ్యాడు. ఈ మేరకు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. అతడి స్థానంలో రిషబ్ పంత్‌ను జట్టులోకి తీసు కోనున్నారు. జూన్ 9న ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో ధావన్ గాయపడిన విషయం తెలిసిందే. కౌల్టర్‌నైల్ విసిరిన బంతి గబ్బర్ చేతికి బలంగా తగిలింది. నొప్పితో ఇబ్బంది పడ్డప్పటికీ అతడు 109 బంతుల్లో 117 పరుగులు చేశాడు. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ నేపథ్యంలో నొప్పితో అతడి వేలు వాచింది. ఆసీస్ ఇన్నింగ్స్‌లో గబ్బర్ ఫీల్డింగ్ కూడా చేయలేదు. అయితే స్కానింగ్ నిర్వహించగా.. వేలుకు ఫ్రాక్చర్ అయినట్లు తేలింది. దీంతో తొలుత మూడు వారాల పాటు గబ్బర్ ప్రపంచకప్‌కు దూరం కానున్నట్లు తెలిపారు.




VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com